# ప్రతిపక్షం

www.prathipaksham.in

సోమవారం 22.12.2025 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 272 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

జెమీమా విధ్వంసం... ఇండియా విజయం 8

# ఇక తోలు తీస్తాం..

## ఇవాల్టి దాక కథ వేరు.. రేపట్నుంచి వేరు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎండగడతాం
- ప్రజా ఉద్యమాలు చేస్తాం.. సభలు పెడతాం
- రాష్ట్రం మొత్తానికే ముప్పు పరిస్థితి వచ్చింది
- హైదరాబాద్‌ను కాపాడడానికే ఫార్మా సిటీ
- నీ ఫ్యూచర్ సిటీ ఎవరికి కావాలి
- ఎరువుల బస్తాకు యాప్ ఎందుకు?
- పాలమూరుకు తీవ్ర అన్యాయం
- కాంగ్రెస్ వచ్చాక భూ ధరలు కుప్పకూలాయి
- నేను చనిపోవాలని శాపాలు పెట్టారు
- ఇవాళ రాష్ట్రంలో ఏం జరుగుతోంది.?
- రియాలిటీ వేరు.. జరుగుతున్నది వేరు
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్ర ఆగ్రహం
- బీఆర్ఎస్ఎల్పీ, రాష్ట్ర కార్యవర్గంతో సమావేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

**హైదరాబాద్, డిసెంబర్21:** హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ఎల్పీ, రాష్ట్ర కార్యవర్గంతో కేసీఆర్ సమావేశమై దిశా నిర్దేశం చేశారు. అనంతరం కేసీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ తెచ్చిన పార్టీగా, ప్రధాన ప్రతిపక్షంగా తమపై రెండు బాధ్యతలు ఉన్నాయని తెలిపారు. మేం అడ్డం పొడువు మాట్లాడి, కారుకూతలు కూసి ఏదో చేస్తామంటే ఇక నడవదని అన్నారు. ఇవాల్టి దాకా వేరు కథ.. రేపట్నుంచి వేరే.. తోలుతీస్తామని హెచ్చరించారు. ప్రజల్లో ఎక్కడికక్కడ నిలబెడతామని అన్నారు.

**అక్కసుతో మాట్లాడట్లేదు..**

తొందరపడి ఏ పని చేయట్లేదని.. అక్కసుతో మాట్లాడట్లేదని కేసీఆర్ తెలిపారు. అనేక రకాల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ పోరాడుతూనే ఉందని పేర్కొన్నారు. కానీ ఇప్పుడు రాష్ట్రం మొత్తానికే ముప్పు వచ్చే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అటు గోదావరి మీద చంద్రబాబు దోపిడీ చేస్తుంటే దాని మీద చప్పుడు లేదు.. ఇటు కృష్ణాలో పాలమూరు ఎత్తిపోతల మీద ఘోరం జరుగుతుంటే దీనిపైనా చప్పుడు లేదు.. మరి రాష్ట్ర ప్రభుత్వం ఎవరి ప్రయోజనాల కోసం ఉన్నట్లు అని ప్రశ్నించారు. ఈ రాష్ట్రంలో ఏం జరుగుతుందని నిలదీశారు. అందుకే ఈ పిరిస్థితుల్లో నేనే స్వయంగా రంగంలోకి దిగాలని అనుకున్నా అని స్పష్టం చేశారు. రెండు మూడు రోజుల్లో గ్రామగ్రామాన సభలు పెడతాం.. కవులు, గాయకులను తట్టి లేపుతామని తెలిపారు.

**హైదరాబాద్‌ను కాపాడడానికే ఫార్మా సిటీ**

ప్రజలు ఎక్కడ చూసినా బీఆర్ఎస్ రావాలని కోరుకుంటున్నారని బీఆర్ఎస్ అధినేత తెలిపారు. తమ చర్యలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో నమ్మకం కోల్పోవడమే దీనికి కారణమని చెప్పారు. అలాగే తాము ఫార్మా సిటీని ఎందుకు తీసుకురావాల్సి వచ్చిందో వివరించారు. హైదరాబాద్ ఫార్మా రంగానికి బెస్ట్ డెస్టినేషన్‌గా మారిందని కేసీఆర్ తెలిపారు. అయితే ఆ కంపెనీల్లోని రసాయన కారకాలు ఇబ్బందిని కలిగిస్తాయి. దీని నుంచి హైదరాబాద్‌ను బయటపడాలి.. అలా అని ఫార్మాను వదులుకోలేం.. అందుకే నాలుగు టీమ్‌లను ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ మార్గాలను వెతికామని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా తిప్పి ఒక ఆలోచనకు వచ్చాం. ఈ క్రమంలోనే జడ్ఎల్‌బీ

...:: మిగతా 2లో

> పాలమూరు జిల్లాకు జరుగుతున్న అన్యాయంపై బీఆర్ఎస్ అధినేత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండేళ్ల నుంచి మౌనంగా ఉన్నానని.. ఇక తప్పనిసరి పరిస్థితి అని బయల్దేరానని తెలిపారు. అటు కేంద్రాన్ని, ఇటు రాష్ట్రాన్ని ఎండగడతానని పేర్కొన్నారు. పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లో గ్రామగ్రామాన ప్రజా ఉద్యమాలు చేస్తాం.. బహిరంగ సభలు పెడతామని తెలిపారు. వాటికి తానే స్వయంగా హాజరవుతానని తెలిపారు. ప్రజాక్షేత్రంలో నిష్క్రియ ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. ఇవాల్టి దాకా వేరు కథ.. రేపట్నుంచి వేరే.. తోలుతీస్తామని హెచ్చరించారు.



# ఇరిగేషన్‌ను నాశనం చేసింది కేసీఆరే!

- ఇంత చేసి నేడు పచ్చి అబద్ధాలాడుతున్నారు
- కాళేశ్వరం కూలిపోవడానికి కారణం కేసీఆరే
- ప్రజల భవిష్యత్తును తాకట్టు పెట్టారు
- రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

**హైదరాబాద్, డిసెంబరు 21 :** రాష్ట్రంలో ఇరిగేషన్‌ను నాశనం చేసింది కేసీఆరేనని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్లో కేసీఆర్ మీడియా సమావేశంలో చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలని ఉత్తమ్ఆరోపించారు. తెలంగాణ సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం రాత్రి మీడియాతో మాట్లాడారు. ఇరిగేషన్‌పై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు 90శాతం అబద్ధమని అన్నారు. కాళేశ్వరం తెలంగాణకు గుండెకాయ అన్నారని.. అది కూలిపోయిందని చెప్పుకొచ్చారు. రూ.1. 80వేల కోట్లతో కట్టిన ప్రాజెక్టు వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం జరగలేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం బ్యారేజీలు కూలిపోవడానికి కారణం.. కేసీఆరేనని ఫైర్ అయ్యారు. ప్రజల భవిష్యత్తును ఆయన తాకట్టు పెట్టారని ఆరోపించారు. కాళేశ్వరం నిర్మాణం తీరును డ్యామ్ సేఫ్టీ అథారిటీ, సుప్రీంకోర్టు జడ్జి కూడా తప్పుపట్టారని ప్రస్తావించారు. కూలిపోయిన ప్రాజెక్టులు కట్టి ఇరిగేషన్ గురించి కేసీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎద్దేవా చేశారు. రూ.38,500 కోట్లతో

...:: మిగతా 2లో

## ఉమ్మడి రాష్ట్రంలో కంటే కేసీఆర్ హయాంలోనే అన్యాయం

### ఏపీ జలదోపిడీకి దోహదం చేసింది కేసీఆరే

### ఇప్పటికైనా బయటికి వచ్చారు.. సంతోషం

- పదేళ్లలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి కాలేదు
- కృష్ణా జలాల్లో సగం వాటా కావాలని కేసీఆర్ అడగలేదు
- జలాల వాటాపై జనవరి 2 నుంచి అసెంబ్లీలో చర్చిద్దాం
- గత, భవిష్యత్తు ప్రణాళికపై చర్చలో కేసీఆర్ పాల్గొనాలి
- కేసీఆర్‌విమర్శలపై సీఎం రేవంత్‌రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

**హైదరాబాద్, డిసెంబర్21:** ఉమ్మడి రాష్ట్రంలో కంటే కేసీఆర్ హయాంలోనే నీటి వాటాల విషయంలో తెలంగాణ అన్యాయం జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చెప్పిన అబద్ధాలు చెప్పకుండా, అబద్ధాలనే పెట్టుబడిగా కేసీఆర్‌మాట్లాడారని విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇప్పటికైనా బయటకు రావడం చాలా సంతోషకరమని సీఎం

...:: మిగతా 2లో

# 'మహాలక్ష్మి'తో లాభాల్లోకి ఆర్టీసీ

- మహాలక్ష్మి ప్రయాణానికి ప్రత్యేక కార్డులు
- నిజామాబాద్, వరంగల్ పట్టణాలకు పీఎం ఈ -డ్రైవ్ కింద 100 ఎలక్ట్రిక్ బస్సులు
- విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే బుక్స్, యూనిఫామ్స్, షూస్
- కులవృత్తుల ఉచిత విద్యుత్ బిల్లుల విడుదల
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- ఆర్టీసీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

**హైదరాబాద్, డిసెంబర్21:** మహాలక్ష్మి పథకం వల్ల ఆర్టీసీ లాభాల్లోకి వచ్చిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ హాస్టళ్లలోని నిరుపేద విద్యార్థులకు కాస్మెటిక్, మెస్ ఛార్జీలను 200 శాతం పెంచామని చెప్పారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ చార్జీల బిల్లులను చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఆదివారం ప్రజాభవన్లో ఆర్టీసీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులతో

...:: మిగతా 2లో

## గాదె ఇన్నయ్య అరెస్టు

- మావోస్టులతో సంబంధాలున్నాని ఎన్ఐఏ కేసు
- నాంపల్లి ఎన్ఐఏ కోర్టులో హాజరుపరిచిన అధికారులు
- 14 రోజుల రిమాండ్.. చంచల్‌గూడ జైలుకు తరలింపు

**ప్రతిపక్షం ప్రతినిధి, వరంగల్, డిసెంబర్21:** మాజీ మావోయిస్టు, సామాజిక ఉద్యమకారుడు గాదె ఇన్నయ్యను నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) అధికారులు అరెస్ట్ చేశారు. జనగామ జిల్లా జఫర్గడ్ మండల కేంద్రంలో ఆయన నిర్వహిస్తున్న అనాథ ఆశ్రమానికి వెళ్లిన ఎన్ఐఏ అధికారులు ఆశ్రమంలో సోదాలు నిర్వహించిన అనంతరం ఇన్నయ్యను అదుపులోకి తీసుకున్నారు. ఇన్నయ్యను నాంపెల్లి ఎన్ఐఏ కోర్టులో హాజరు పరిచారు. కోర్టు 14 రోజుల రిమాండ్‌విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఇటీవల మరణించిన మావోయిస్టు నేత కాతా రామచంద్రారెడ్డి అలియాస్ వికల్ప్‌అంత్యక్రియలలో ఇన్నయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన

...:: మిగతా 2లో

# ఫోన్ ట్యాపింగ్ కేసులో చార్జిషీట్

- ప్రతి ఒక్కరినీ విచారించాలని ఆదేశం
- సీపీ సజ్జనార్ సంచలన నిర్ణయం
- సిట్ అధికారులతో సమావేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

**హైదరాబాద్, డిసెంబర్ 21:** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో పూర్తి స్థాయి ఛార్జిషీట్‌కు సిట్ చీఫ్, హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆదేశించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌లో సిట్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధం ఉన్న ప్రతి ఒక్కరిని విచారించాలని ఈ సందర్భంగా ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. ఈ కేసు సుప్రీంకోర్టు పరిధిలో ఉందని, ఈ నేపథ్యంలో అందరూ జవాబుదారితనంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. మరో వైపు ఈ కేసులో కీలకంగా ఉన్న ప్రభాకర్ రావు గత పది రోజులుగా కస్టోడియల్ విచారణలో ఉన్నారు. ఈ విచారణలో ఆయన నుంచి సిట్ అధికారులు కీలక సమాచారాన్ని రాబట్టినట్లు సమాచారం. తొలుత చార్జ్‌షీట్ వేసి.. అనంతరం కేసుతో సంబంధమున్న వారందరిని విచారించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. రాజకీయ నాయకులతో పాటు ఉన్నతాధికారులను సైతం విచారించేందుకు సిట్ తగిన ఏర్పాట్లు చేస్తోంది. ఈ కేసులో నిందితుడు ప్రభాకర్ రావును సిట్ చీఫ్ సజ్జనార్‌విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ కేసులో ఇప్పటి వరకు నిందితులను ఏసీపీ, డీసీపీ, జాయింట్ సీపీ స్థాయి అధికారులు మాత్రమే విచారించారు.

### రైల్వే టికెట్ చార్జీల పెంపు

ఆరు నెలల వ్యవధిలో రైల్వే శాఖ మరోసారి ప్రయాణికుల చార్జీలు పెంచింది. పెరిగిన చార్జీలు ఈ నెల 26 నుంచి అమల్లోకి వస్తాయని ప్రకటించింది. సబర్బన్ రైలు ప్రయాణ చార్జీలు యథాతథంగా కొనసాగుతాయని తెలిపింది.

7

### 'వీబీ జీ రామ్ జీ' బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ చట్టం స్థానంలో కేంద్రం తీసుకు వచ్చిన 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్' వీబీ జీ రామ్ జీ బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఆదివారంనాడు ఆమోదం తెలిపారు.

7

### ఆరావళి పర్వతాలపై అసత్య ప్రచారం

ఆరావళి పర్వతాల మైనింగ్‌పై కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని కేంద్ర పర్యావరణశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ అన్నారు. అక్కడ కేవలం 0.19% శాతం పరిధిలోనే తవ్వకాలకు అనుమతి ఇచ్చినట్టు చెప్పారు.

7

### ఏఐ, చాట్ జీపీటీ వాడొద్దు

మనదేశంలో ఏఐ, చాట్ జీపీటీ టెక్నాలజీ వాడకం అనూహ్యంగా పెరిగిపోయింది. అయితే ఈ రెండింటినీ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు వాడటం అత్యంత ప్రమాదకరమని కేంద్రం తాజాగా పేర్కొన్నది.

7

రాజకీయం

# కేసీఆర్ హయాంలోనే అన్యాయం

మొదటిపేజీ తరువాయి

అన్నారు. కేసీఆర్ చేసిన విమర్శలపై ఆయన స్పందించారు. 811 టీఎంసీల నికర జలాల్లో 299 టీఎంసీలు చాలని సంతకం చేసింది కేసీఆరేనని, నీటి వాటాలపై సంతకం చేసి ఏ జిల్లాలకు మరణ శాసనం రాశారని ప్రశ్నించారు. కృష్ణా జలాల్లో 71శాతం వాటా కావాలని కొట్లాడుతున్నామని, ఏపీ జలదోపిడీకి దోహదం చేసింది కేసీఆరే నని సీఎం రేవంత్‌అన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి కాలేదని, కృష్ణా జలాల్లో సగం వాటా కావాలని కేసీఆర్ అడగలేదని, కృష్ణా, గోదావరి జలాల వాటాపై జనవరి 2 నుంచి అసెంబ్లీలో చర్చిద్దామని అన్నారు. కేసీఆర్, కేటీఆర్ ఆర్థిక ఉగ్రవాదులు. అసెంబ్లీ సమావేశాలకు రావాలని కేసీఆర్కు విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్ష నేత బయటకు రావడాన్ని స్వాగతిస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

**కేసీఆర్‌కు ప్రమాదం కుటుంబ సభ్యులతోనే..**

"గతంతో పాటు భవిష్యత్తు ప్రణాళికపై చర్చలో కేసీఆర్ పాల్గొనాలి. కేసీఆర్ వల్ల జరిగిన విధ్వంసాన్ని సరిదిద్దుకుంటూ వస్తున్నాం. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే మీ పాలన, మా పాలనపై చర్చిద్దాం. చర్చిద్దామంటే కేసీఆర్ ముఖం చాటేస్తున్నారు. కేటీఆర్, హరీశ్రావు కలిసి కేసీఆర్ను నిర్బంధించారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలపై అనుమానాలుంటే నిజనిర్ధారణ కమిటీ వేస్తాం. ఆయన వయసుకు తగిన మాటలు మాట్లాడలేదు. కేసీఆర్ తమలపాకుతో కొడితే.. నేను తలుపు చెక్కతో కొట్టే రకం. ఇప్పుడు కూడా కేసీఆర్ క్రియాశీల రాజకీయాల్లో లేరు. ఆయనకు బయటి వాళ్లతో ఎలాంటి ప్రమాదం లేదు.. కుటుంబ సభ్యులతోనే ప్రమాదం. పార్టీని ఆధీనంలోకి తీసుకునేందుకు కేటీఆర్, హరీశ్ రావు పోటీ పడుతున్నారు. పార్టీని టేకోవర్ చేస్తే ఒక్కసారిగా హరీశ్కు రూ.5వేల కోట్లు వస్తాయి. అసెంబ్లీకి రావాలని కేసీఆర్కు సూచన చేస్తున్నా. సవాల్ చేయడం లేదు. సభకు వస్తే ఆయన గౌరవానికి ఎలాంటి భంగం ఉండదు.. నాది హామీ. ఎవరైనా భంగం కలిగిస్తే చర్యలు తీసుకోవాలని స్పీకర్కు విన్నవిస్తా. బహిరంగ సభల కంటే అసెంబ్లీలోనే సమగ్రంగా చర్చిద్దాం. ప్రాజెక్టుల విషయంలో ఎన్డీఎస్ఏ సూచనలతోనే ముందుకెళ్తున్నాం. సాంకేతిక నిపుణుల కమిటీ సలహాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయి" అని సీఎం అన్నారు.

# ఇరిగేషన్‌ను నాశనం చేసింది కేసీఆరే!

మొదటిపేజీ తరువాయి

పూర్తయ్యే ప్రాజెక్టును రూ.లక్ష కోట్లకు ఎందుకు పెంచారని ప్రశ్నల వర్షం కురిపించారు. కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు అంచనా పెంచారని ఆరోపించారు. రూ.18 వేల కోట్లతో సీతారామ ప్రాజెక్టు నిర్మిస్తున్నామని స్పష్టం చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్నా కేసీఆర్ దేవాదుల ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. రూ.లక్షల కోట్ల అప్పుతెచ్చి కూడా ప్రాజెక్టు పూర్తి చేయలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందున్న పెండింగ్ ప్రాజెక్టులు కేసీఆర్ ఎందుకు పూర్తి చేయలేదు? అని ప్రశ్నించారు. ఎస్ఎల్బీసీ, డిండి ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయలేదో ప్రజలు అడుగుతున్నారని.. కేసీఆర్ వెంటనే సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా ఒక్క ఎకరానికి కూడా నీరు ఇవ్వలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ హయాంలోనే ఈ ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చామని తేల్చిచెప్పారు. పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్ పచ్చి అబద్దాలు మాట్లాడటం సరికాదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హితవు పలికారు.

**పాలమూరు ప్రాజెక్టుకు రూ.7వేల కోట్లు ఖర్చు**

కృష్ణా జలాల కోసం గట్టిగా ట్రైబ్యునల్‌లో పోరాడుతున్నామని పేర్కొన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.7 వేల కోట్లు ఖర్చు పెట్టామని వివరించారు. ఈ ప్రాజెక్టుకు 90 టీఎంసీల కంటే తక్కువ అడగ లేదని అన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు రద్దు చేసి రాష్ట్రానికి అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ తప్పుల వల్లే ఇరిగేషన్ వ్యవస్థ నాశనమైందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధ్వజమత్తారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు పాలెం గుట్టపై కుర్చీ వేసుకొని పూర్తిచేస్తానన్న కేసీఆర్ ఆ పని ఎందుకు చేయలేదని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో కాల్వలు పూర్తి కాకుండానే ఒక్క పంపును ప్రారంభించి పూర్తి చేశానని ప్రజలను నమ్మబలికే ప్రయత్నం చేశారన్నారు. ఎన్నికల్లో పాలమూరు ప్రజలు ఏ మేరకు దిమ్మ తిరిగే తీర్పు ఇచ్చారన్నారు. పదేళ్లలో తెలంగాణాకు తీవ్ర అన్యాయం చేసిన కేసీఆర్, నేడు మరో ఉద్యమం చేస్తామని ప్రకటించడం హాస్యాస్పందంగా ఉందన్నారు.

**సీఎం సవాల్ కు సిద్దమేనా...**

ప్రాజెక్టుల నిర్మాణం, నీటి పంపకాలలో ఎవరు ఏం చేశారో ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తానన్న సీఎం రేవంత్ రెడ్డి సవాల్‌కు జవాబు ఇవ్వలేదని దుయ్యబట్టారు. మాయమాటలతో ప్రజలను నమ్మించి పదేళ్లు అధికారంలో ఉంటూ అన్నింట్లో తెలంగాణాకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఇప్పుడు మరో మారు ప్రజలను తన మాయమాటలతో నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నారని, ప్రజలు గమనిస్తున్నారన్నారు.

# గాదె ఇన్నయ్య అరెస్టు

మొదటిపేజీ తరువాయి

మావోయిస్టులకు అనుకూలంగా మాట్లాడడంతో పాటు, మావోయిస్టు సిద్ధాంతాలను ప్రచారం చేశారనే ఆరోపణలపై కేసు నమోదు చేసిన ఎన్ఐఏ అధికారులు ఆయనను అరెస్టు చేశారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర ఉత్కంఠకు దారితీసింది. గాదె ఇన్నయ్య తెలంగాణ ఉద్యమకారుడిగా, సామాజిక విశ్లేషకుడిగా, రాజకీయ వక్తగా రాష్ట్రవ్యాప్తంగా సుపరిచితుడు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పనిచేసే తెలంగాణ రాష్ట్ర పార్టీని ఆయన స్థాపించగా, గతంలో పీపుల్స్ వార్ గ్రూప్ జిల్లా కార్యదర్శిగా కూడా పని చేశారు. ఇటీవలి కాలంలో జనగామ జిల్లాలో అనాథ ఆశ్రమం నిర్వహిస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు.

**హిడ్మా మరణంపై భావోద్వేగ ప్రసంగం**

మావోయిస్టు నేత హిడ్మా ఎన్ కౌంటర్ తర్వాత గాదె ఇన్నయ్య ఛత్తీష్‌గడ్ వెళ్లారు. హిడ్మా తల్లిని కలిశారు. అక్కడున్న నేషనల్, స్టేట్ మీడియాతో పాటు యూట్యూబ్ ఛానళ్లతో హిడ్మా మరణంపై ఉద్వేగభరితమైన ప్రసంగం చేశారు. ఈ సమయంలోనే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు వ్యతిరేకంగా మాట్లాడారు. అమిత్ షా తీరును తప్పుబట్టారు. ఈ నేపథ్యంలోనే ఆయనపై ఎన్ఐఏ ఫోకస్ పెట్టింది. ఇప్పటికే చాలా సార్లు నోటీసులు పంపింది. తాజాగా, మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలతో ఇన్నయ్యపై కేసు నమోదు చేసింది. కాగా, ఇన్నయ్య నిర్వహిస్తున్న అనాథాశ్రమంలో 200 మంది అనాథ పిల్లలు ఆశ్రయం పొందుతున్నారు.

# సర్పంచులకు 'కుర్చీలు' వితరణ

- కుర్చీలను బహుమతిగా అందజేసిన కేకే కృష్ణ

**ప్రతిపక్షం, షాద్‌నగర్, డిసెంబర్21:** ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో గెలుపొందిన నూతన సర్పంచులకు కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు, సామాజికవేత్త కేకే కృష్ణ కుర్చీలను అందజేశారు. ఆదివారం నూతన సర్పంచులను ఆయన కలుసుకోవడంతో పాటు అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి సత్యనారాయణ రెడ్డి జాకారం శేఖర్ తదితరులను కలుసుకొని ఉమ్మడి మండలంలోని కొందుర్గు, జిల్లేడు చౌదరి గూడెం మండలాల్లో సుమారు 30 మందికి పైగా నూతన సర్పంచులకు ప్రత్యేక కుర్చీలను ఆయన ఉచితంగా అందజేశారు.

# మీరిచ్చిన హామీలు ఏమయ్యాయి?

- సోనియా గాంధీకి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ

**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్21 :** కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధికి బహిరంగ లేఖ రాశారు. ''రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ పేరుతో రూపొందించిన డాక్యుమెంట్ పుస్తకాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ ఇటీవల మీకు అందించారు. ఆ సమయంలో 2 సంవత్సరాల పాలనలో ప్రభుత్వ పనితీరు, రాష్ట్ర అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉన్న దూరదృష్టిని అభినందించినట్లు, తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ కు అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు ప్రకటించారు.'' అని లేఖలో పేర్కొన్నారు. కానీ, 2023 లో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జరుగుతున్న సమయంలో 17 సెప్టెంబర్, 2023 న హైదరాబాద్ నగర శివారులోని తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన బహిరంగ సభలో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అభయహస్తం పేరిట కాంగ్రెస్ పార్టీ రూపొందించిన మేనిఫెస్టోను ఆవిష్కరించడమే కాకుండా సోనియా గాంధీ స్వయంగా 6 గ్యారంటీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని ప్రకటించారని కిషన్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలిచి, అధికారం చేపట్టి 2 సంవత్సరాల పాలన పూర్తి చేసుకుందని, ఈ 2 సంవత్సరాల కాలంలో పార్టీ మేనిఫెస్టో అమలు గురించి కానీ, మీరు స్వయంగా ప్రకటించిన 6 గ్యారంటీల అమలు గురించి కానీ ఏనాడైనా తెలుసుకోవడానికి ప్రయత్నించారా? కనీసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిమ్మల్ని కలిసిన సమయంలోనైనా వీటి అమలు గురించి అడిగి తెలుసుకున్నారా? అని ప్రశ్నించారు. మీరు ఇచ్చిన హామీల అమలులో మోసం చేస్తే, భవిష్యత్తులో తెలంగాణ ప్రజలు కూడా మీకు మద్దతు ఇచ్చే విషయంలో ప్రతిచర్యలకు పాల్పడి తగిన గుణపాఠం చెబుతారన్న విషయం గుర్తుంచుకోండి అంటూ కేంద్ర మంత్రి తన బహిరంగ లేఖలో ప్రస్తావించారు.

# ఇక తోలు తీస్తాం..

మొదటిపేజీ తరువాయి

అని వచ్చింది.. అంటే జీరో లిక్విడ్ బేస్. వ్యర్థాలను జీరో లిక్విడ్ చేస్తారు. దాని వల్ల కాలుష్యం రాదు. అంతర్జాతీయంగా అది సక్సెస్ అయ్యింది. అయితే మనం ఆ సిస్టమ్ పెట్టుకోవాలని.. అలాగే ఫార్మా యూనివర్సిటీ పెట్టుకోవాలని అనుకున్నాం.' అని కేసీఆర్ వివరించారు. దీనికోసం ఐదారు సంవత్సరాలు కష్టపడి, రైతాంగంతో ఘర్షణ పడకుండా 14 వేల ఎకరాలను సమీకరించామని తెలిపారు. 20 వేల ఎకరాలు లక్ష్యంగా పెట్టుకుంటే తాము అధికారంలో ఉన్న సమయంలో 14 వేల ఎకరాలను సమీకరించగలిగామని పేర్కొన్నారు.

**నీ ఫ్యూచర్ సిటీ ఎవరికి కావాలి..**

ఇవాళ రాష్ట్రంలో ఏం జరుగుతుందని సీఎం రేవంత్ రెడ్డిని కేసీఆర్ ప్రశ్నించారు. నీ ఫ్యూచర్ సిటీ.. తొక్కలో సిటీ ఎవడికి కావాలన్నారు. హైదరాబాద్‌ను నువ్వేమైనా పెంచావా అని నిలదీశారు. 400 ఏండ్ల చరిత్రతో హైదరాబాద్ పెద్ద సిటీ అయ్యిందని తెలిపారు. అంత చరిత్ర ఉన్న హైదరాబాద్ మహానగరాన్ని దృష్టిలో పెట్టుకుని ఫార్మా సిటీ తీసుకొచ్చామని తెలిపారు. 'ఇవాళ సిటీ మొత్తం గబ్బు లేచిపోవాలి.. నువ్వేమో ఫ్యూచర్ సిటీ.. తొక్కలో సిటీ అని దిక్కుమాలిన పాలసీలు తీసుకొస్తూ.. రియల్ ఎస్టేట్ బ్రోకర్ దందా చేస్తున్నా' వని మండిపడ్డారు.

**ఎరువుల బస్తాకు యాప్ ఎందుకు..**

బీఆర్ఎస్ రాకముందే యూరియా కోసం చెప్పుల లైన్లు ఉండేవని.. ఇప్పుడు మళ్లీ బీఆర్ఎస్ పోగానే చెప్పుల లైన్లు దర్శనమిస్తున్నాయని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి యూరియా సరఫరా చేసే తెలివితేటలు కూడా లేవని మండిపడ్డారు. ఎరువుల బస్తాకు యాప్ ఎందుకు అని ప్రశ్నించారు. సంక్షేమం, అభివృద్ధి, పారిశ్రామిక, ఐటీ రంగం, లా అండ్ ఆర్డర్ మెయింటైన్ చేయడంలో కానీ ఒక మంచి పద్ధతిలో వెళ్లామని తెలిపారు. కానీ ఇవాళ జంట నగరాల్లో పట్టనగలు నడిరోడ్డుపై మర్డర్లు జరుగుతున్నాయని. అడిగే దిక్కు లేదని విమర్శించారు. మానభంగాలు జరుగుతున్నాయని అన్నారు. ఎన్‌సీఆర్‌బీ రిపోర్టు ప్రకారం 20 శాతం క్రైమ్ రేటు పెరిగిందని.. వీటన్నింటిని రికార్డు చేసుకుంటూ చర్చిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్‌కు ఓటు వేసే ఉద్దేశం ఉన్న ప్రజలను పచ్చి అబద్ధాలు చెప్పి, మోసం చెప్పి, మాయమాటలు చెప్పారని కేసీఆర్ మండిపడ్డారు. రెండు సార్లు రైతుబంధు ఎగ్గొట్టిండ్రు.. రెండు నెలల పెన్షన్లు ఎగ్గొట్టిండ్రు.. చాలా భయంకరమైన పరిస్థితులు తీసుకొచ్చారని కేసీఆర్ మండిపడ్డారు. కేసీఆర్ రెండు అంటే వీడు నాలుగు అంటున్నాడు కాబట్టి ఇస్తాడేమో అని అనుకున్నారు. టెంప్ట్ అయి ఓటు వేశారు.. ఇప్పుడు తలలు బాదుకుంటున్నారని, భయంకరంగా తిడుతున్నరని తెలిపారు. ప్రజలంతా బీఆర్ఎస్ రావాలని కోరుకుంటున్నారని చెప్పారు.

**పెండింగ్ ప్రాజెక్టులు అన్నీ లైన్‌లోకి తెచ్చాం**

'రాష్ట్రం వచ్చిన తర్వాత మొత్తం సమీక్ష చేసుకున్నాం.. మనకు రావాల్సిన వాటా ఎంత? దగా ఎక్కడ జరిగింది? ఎలా సరిదిద్దాలని ఆలోచన చేశాం. మహబూబ్‌నగర్ జిల్లాను ఆదుకోవాలని ప్రస్థానం ప్రారంభించాం. యుద్ధ ప్రాతిపదికన పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ చేశాం. నెట్టెంపాడు, భీమా, కల్వకుర్తి అన్నింటినీ లైన్‌లోకి తెచ్చాం. నికరంగా ఆరున్నర లక్షల ఎకరాలకు ఆయకట్టు తెచ్చాం. అలాగే అనేక చెక్‌డ్యామ్‌లు కట్టాం. ఆర్డీఎస్ కెనాల్ మోసం జరిగింది కాబట్టి తుంగభద్ర మీద పెట్టి తుమ్మిళ్ల లిఫ్ట్ తెచ్చి, పూర్తి చేశాం. ఆయకట్టు పారిపించాం. మిషన్ కాకతీయలో టాప్ ప్రియారిటీ ఇచ్చి మైనర్ ఇరిగేషన్ చెరువుల సామర్థ్యాలను పెంచాం. అలా 1.5 లక్షల ఎకరాలకు దోహదపడింది.' అని కేసీఆర్ తెలిపారు. 'మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలో కురిసే ప్రతి వర్షం చుక్క కృష్ణా నదిలోకే వెళ్తుంది.. ఇవి కృష్ణా బేసిన్‌లో ఉన్నాయి. సమైక్య రాష్ట్రంలో జరిగిన మోసం నుంచి బయటపడాలంటే కొట్లాడి మన వాటా మనం సాధించుకోవాలి.. కృష్ణా జలాల పునఃపంపిణీపై ట్రిబ్యునల్ వేయించాలని స్ట్రాటజీతో వెళ్లాం. ఈ ప్రాజెక్టులను పూర్తిచేస్తూనే పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టాం. ఈ పథకానికి 173 టీఎంసీలు తీసుకోవాలనేది బీఆర్ఎస్ స్ట్రాటజీ. ప్రాజెక్టుకు 35 వేల కోట్లు మంజూరు చేశాం. అందులో 27 వేల కోట్లు ఖర్చు చేసి 88-90 శాతం పనులు పూర్తి చేశాం. ఆంధ్రాతో పంచాయితీ ఉంటుందని.. వీలైనంత తొందరగా నీటిని తీసుకోవాలని 145 మెగావాట్ల కెపాసిటీ పంప్‌లను పెట్టాం. తర్వాత అనుమతులపై అనేక అనేక మెలికలు పెట్టారు. భూసమీకరణలో ఇబ్బందులు తెచ్చారు.. అయినా 27వేల ఎకరాలకు సమీకరించాం.' అని కేసీఆర్ వివరించారు.

**నేను చనిపోవాలని శాపాలు పెట్టారు**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు అవుతున్నా ఒక్క కొత్త పాలసీని కూడా తీసుకురాలేదని విమర్శించారు. నన్ను దూషించడం, నేను చనిపోవాలని శాపాలు పెట్టడమే ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానమని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఏరోజు అహంకారపూరిత హింస ప్రయత్నాలు చేయలేదని కేసీఆర్ తెలిపారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షాలతో ఎలా వ్యవహరించాలో నేర్పుతున్నదని అన్నారు. గుడ్లు తీయడం, లాగులో తొండలు ఇడవడం వంటివి ఎలా చేయాలో చెబుతున్నదని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేండ్లలో ఒక్క కొత్త పాలసీని కూడా తీసుకురాలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పథకాలు ప్రకటించకపోగా.. ఉన్నవాటిని కూడా ఆపేందని అన్నారు. తీసుకొచ్చిన పాలసీ అంతా కూడా రియల్ ఎస్టేట్‌కు సంబంధించినదే అని పేర్కొన్నారు. అయినప్పటికీ రాష్ట్రంలో ప్రజల ఆస్తుల విలువ పూర్తిగా తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు యూరియా రైతుల ఇంటికి, చేను వద్దకు డైరెక్ట్‌గా వచ్చేదని గుర్తుచేశారు. కానీ ఇప్పుడు యూరియా బస్తా కోసం రైతు కుటుంబమంతా లైన్‌లో నిలబడే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు.

**కుప్పకూలిన భూముల ధరలు**

మేము భూముల ధరలు పెంచినం. ప్రజల ఆస్తిని పెంచినం. రోడ్డు సమీపంలో 4 ఎరాలున్న వారు ధీమాతో ఉన్నారు. కానీ, కాంగ్రెస్ వచ్చాక ఇప్పుడు ధరలు కుప్పకూలాయి. అమ్మాయి పెళ్లి చేయలేక తక్కువేకే అమ్ముకోవాల్సిన దుస్థితి. కేవలం రాజకీయ అధికారమే లక్ష్యంగా రైతులు, పేద ప్రజలు, విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగులను రేవంత్ రెడ్డి వేధిస్తున్నారు. కేసీర్ చేసిన అప్పులకు పడ్డీలు కట్టలేకపోతున్నాని రేవంత్ చెబుతున్నాడు. కానీ, కాగ్ మనోడికి మొట్టికాయలు వేసింది అని కేసీఆర్ గుర్తు చేశారు. నన్ను తిట్టినదానికి వారి నోళ్లకు మొక్కాలి. పొద్దాక అదే కథనా. మాట్లాడనప్పుడల్లా కేసీఆర్ చచ్చిపోవాలి అనేనా. ఇంత అక్కసుంటాది మనిషిమీద. నోరు తెరిస్తే పచ్చి అబద్ధాలు. రియాలటీ వేరు. జరుగుతున్నది వేరు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారు అని కేసీఆర్ కాంగ్రెస్‌ను కడిగిపారేశారు.

# 'మహాలక్ష్మి'తో లాభాల్లోకి ఆర్టీసీ

మొదటిపేజీ తరువాయి

ఉప ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఇతర జాయింట్ ట్రాన్స్ పోర్ట్ అధికారులు, ఎంజేపీ కార్యదర్శి సైదులు, బీసీ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఆర్టీసీని బలోపేతం చేసేందుకు, కార్మికులను ఆదుకునేందుకు ప్రజాప్రభుత్వం కీలక చర్యలను తీసుకుంటోందని అన్నారు. ముఖ్యంగా మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ లభాల్లోకి వచ్చిందని అన్నారు. మహిళా సంఘాల నుంచి రుణాలు తీసుకోవడంతో పాటుగా, ప్రభుత్వం అందించిన సహకారంతో సంస్థకు కొత్త బస్సులు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. బస్ డిపోల ఏర్పాటు, బస్ స్టేషన్ల అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందిస్తోందని భట్టి చెప్పారు. ప్రభుత్వ సహకారంతో పాటుగా సంస్థ స్వతహాగా నూతనంగా ఆదాయా మార్గాలను అన్వేషించాలని ఉప ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఆర్టీసీలో మహాలక్ష్మీ పథకం కింద ఇప్పటి వరకు రూ.255 కోట్ల ఉచిత ప్రయాణాలు జరగాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీలో పీఎఫ్ బకాయిలు రూ. 1400 కోట్లు ఉండగా.. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో రూ. 660 కోట్లకు తగ్గించినట్లు ఆయన చెప్పారు. అలాగే సీసీఎస్ బకాయిలు గతంలో రూ.600 కోట్లు ఉండగా, రూ.373 కోట్లకు తగ్గించినట్లు తెలిపారు. ఆర్టీసీలో మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం కోసం సెంటర్ ఫర్ గుడ్ గుడ్ గవర్నెన్స్ తో ఒప్పందం చేసుకొని ప్రత్యేక కార్డులు పంపిణీ చేయాలని అధికారులను బట్టి విక్రమార్క ఆదేశించారు. ఆర్టీసీలో పీఎం ఈ డ్రైవ్ కింద హైదరాబాద్ లో 2800 ఎలక్ట్రిక్ బస్సులు వస్తున్నాయని, వీటికి చార్జింగ్ స్టేషన్లు మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. పీఎం ఈ డ్రైవ్ కింద నిజామాబాద్ వరంగల్ పట్టణాలకు 100 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు యూనిఫామ్స్, బుక్స్, షూస్ పంపిణీ చేయాలని అందుకు సంబధించిన నిధులు విషయంలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఫైనాన్స్ సెక్రటరీ సందీప్ సుల్తానియా ను డిప్యూటీ సీఎం ఆదేశించారు. నాయి బ్రాహ్మణ, రజకకుల సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్తుకు సంబంధించిన బకాయిలు లేకుండా ఎప్పటికప్పుడు విడుదల చేయాలని ఆదేశించారు. ప్రజాప్రభుత్వం విద్యపై ప్రత్యేక శ్రద్ధను తీసుకుంటోందని స్పష్టం చేశారు. అందులో భాగంగానే ఒకేసారి వంద ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను మంజూరు చేసిందని చెప్పారు. ఇదిలా ఉండగా.. అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పోస్టుల నియామకాలకు ఆర్థిక శాఖ నుంచి అనుమతి ఇవ్వాలని రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ సందర్భంగా కోరారు. అదే విధంగా మార్చ్ 2026 వరకు 3,233 కండక్టర్ పోస్టులు అవసరం ఉండగా తాత్కాలికంగా నియామకాలు జరపడంతో పాటు 50 శాతం రెగ్యులర్ నియామకాలకు అనుమతి ఇవ్వాలని కోరారు. వాటితో పాటు చీఫ్ అకౌంట్స్‌ఆఫీసర్ పోస్టులకు అనుమతి ఇవ్వాలని కోరారు. అంతేకాక డ్రైవింగ్ లైసెన్స్‌ల జారిలో ఉన్న ఇబ్బందులు తేలెత్తకుండా యూజర్ ఛార్జీలకు అనుమతి ఇవ్వాలని కోరారు. రవాణా శాఖలో ఎన్ఫోర్స్మెంట్ పెంచడానికి కొత్త వాహనాలకు అనుమతి ఇవ్వాలని, టాక్స్ కలెక్షన్ కోసం ట్యాబ్లు మంజూరు చేయాలని మంత్రి ప్రభాకర్ కోరారు.

# నీళ్లు, వైద్యం, రైతు హక్కులు, విద్యపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- గద్వాల్–ఆలంపూర్‌లో 'జాగృతి జనం బాట'

**ప్రతిపక్షం గద్వాల్/ఆలంపూర్, డిసెంబర్21:** సాగునీరు, ప్రభుత్వ వైద్యం, రైతు సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. తుమ్మిళ్ల ప్రాజెక్ట్‌ను పూర్తి స్థాయిలో వినియోగించకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని, ఆలంపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనం బాట కార్యక్రమంలో భాగంగా గద్వాల్, ఆలంపూర్ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించిన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.. సాగునీరు, ప్రభుత్వ వైద్యం, విద్య, రైతు సమస్యలు, పరిశ్రమల అనుమతుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తీవ్ర విమర్శలు చేశారు. స్వాతంత్ర్యం వచ్చి ఎన్నేళ్లు గడిచినా గద్వాల్ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడిపోవడం దారుణమని వ్యాఖ్యానించారు. ఆలంపూర్ ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రిలో కనీస వసతులు, సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అవసరమైన వైద్య పరీక్షల సౌకర్యం లేక గద్వాల్‌కు రిఫర్ చేయాల్సి వస్తోందని, దీంతో రిపోర్టులు ఆలస్యమై పేద ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలంపూర్‌లోనే అన్ని రకాల వైద్య పరీక్షలు చేసేలా తక్షణమే సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తుమ్మిళ్ల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పంప్ హౌస్‌ను పరిశీలించిన అనంతరం కవిత మాట్లాడుతూ, ఆర్డీఎస్‌కు కేటాయించిన నీటిని తెలంగాణ పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్న పరిస్థితి కొనసాగుతోందన్నారు. మూడు మోటార్లు అందుబాటులో ఉన్నా ఒక్క మోటార్ మాత్రమే నడుస్తోందని, కాల్వల విస్తరణ, భూసేకరణ సమస్యల కారణంగా ప్రాజెక్ట్ పూర్తి సామర్థ్యంతో పనిచేయడం లేదని తెలిపారు. తెలంగాణ వచ్చి 12 ఏళ్లు గడిచినా రైతులకు హక్కు మేరకు నీళ్లు అందకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు. ఆరు నెలల్లో ప్రభుత్వం తుమ్మిళ్ల ప్రాజెక్ట్‌పై దృష్టి పెట్టి సమస్యలు పరిష్కరించకపోతే పాదయాత్ర చేపట్టి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని హెచ్చరించారు. పెద్ద ధన్వాడలో ప్రతిపాదిత ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న రైతులతో కవిత సమావేశమయ్యారు. పచ్చని పంట పొలాలు, ఆర్డీఎస్ కాల్వల సమీపంలో పరిశ్రమలకు అనుమతులు ఇవ్వడం ప్రమాదకరమని అన్నారు. భవిష్యత్తులో ఫ్యాక్టరీ వ్యర్థాలు కాల్వల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతులను మోసం చేసి భూములు కొనుగోలు చేశారంటేనే ఈ ప్రాజెక్ట్ వెనుక అనుమానాలు ఉన్నాయని తెలిపారు. ఈ ఫ్యాక్టరీ రద్దయ్యే వరకు రైతులతో కలిసి ఉద్యమిస్తానని స్పష్టం చేశారు. గద్వాల్ జిల్లాలో విద్యా పరిస్థితులపై కూడా కవిత తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు దాటినా గద్వాల్‌లో అక్షరాస్యత పెరగకపోవడం, చైల్డ్ లేబర్ ఎక్కువగా ఉండటం తనను కలిచివేస్తోందని అన్నారు. జిల్లాలో ఒక్క ఇంజనీరింగ్ కాలేజ్ కూడా లేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. వైద్య అవసరాల కోసం గద్వాల్ ప్రజలు పెద్ద సంఖ్యలో కర్నూల్‌కు వెళ్లాల్సి వస్తోందని, అక్కడ ఆరోగ్యశ్రీ వర్తించకపోవడం వల్ల పేదలు మరింత నష్టపోతున్నారని తెలిపారు. అయిజలోని సీడ్ కాటన్ జిన్నింగ్ మిల్‌ను పరిశీలించిన కవిత, విత్తన కంపెనీలు రైతులను సంవత్సరాలుగా దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. రైతులకు ఇవ్వాల్సిన ధరలను తగ్గిస్తూ కంపెనీలు కోట్ల రూపాయల బకాయిలు పెట్టాయని తెలిపారు. రైతులకు సీడ్ కంపెనీలతో తప్పనిసరిగా అగ్రిమెంట్ ఉండేలా ప్రభుత్వమే పాలసీ తీసుకురావాలని డిమాండ్ చేశారు.

ప్రజల కోసం చేసిన పోరాటాల వల్ల తనపై 109 కేసులు పెట్టారు. ఈ విషయం తెలిసిన చంద్రబాబు ఇన్ని కేసులున్నాయా? అని అమిత్ షాను అడిగారు. అందుకే సంజయ్ కేంద్ర హోంశాఖకు సహాయ మంత్రి అయ్యారు అని షా బదులిచ్చారు. వైద్యులు ఫార్మా కంపెనీలు, డయాగ్నోస్టిక్ సెంటర్ల వలలో పడి ప్రజలకు అన్యాయం చేయొద్దు.
- మెడికల్ కాలేజీ వార్షికోత్సవంలో కేంద్ర మంత్రి సంజయ్

# ఎస్ఐఆర్‌తో తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుంది

- ఎన్నికల వ్యవస్థకు బూత్ లెవెల్ ఆఫీసర్లే వెన్నెముక
- జాబితా పూర్తయితే కొత్త యుగంలో అడుగు
- భారత ఎన్నిక ప్రధానాధికారి గ్యానేశ్ కుమార్

**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 21:** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) విషయంలో తెలంగాణ త్వరలోనే దేశమంతటికి మార్గదర్శకంగా నిలుస్తుందని భారత ప్రధాన ఎన్నికల కమిషనర్‌గ్యానేశ్ కుమార్ అన్నారు. ఆదివారం హైదరాబాద్లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర బూత్ లెవెల్ ఆఫీసర్స్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులను (బీఎల్‌ఓలు) ఉద్దేశించి మాట్లాడుతూ ఈ విషయంలో ఇటీవల బీహార్‌లో విజయవంతంగా పూర్తయిన ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రమాణంగా తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

**ఎన్నికల వ్యవస్థకు బీఎల్‌ఓలే వెన్నెముక..**

భారత ఎన్నికల వ్యవస్థకు బీఎల్‌ఓలే వెన్నెముక అని, వారి నిబద్ధత, కృషిపైనే ఓటర్ల జాబితా శుద్ధి విజయం ఆధారపడి ఉంటుందని గ్యానేశ్‌కుమార్‌తెలిపారు. ప్రపంచం మొత్తం భారతదేశం ఎన్నికలను ఎలా నిర్వహిస్తుందో తెలుసుకోవాలనే ఆసక్తితో గమనిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. బీహార్‌ను ఉదాహరణగా ప్రస్తావిస్తూ, అక్కడ నిర్వహించిన భారీ ఎస్ఐఆర్ ప్రక్రియ ఎలాంటి లోపాలు లేకుండా పూర్తయిందని సీఈసీ తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సుమారు 7.5 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, ఈ మొత్తం ప్రక్రియలో ఒక్క ఫిర్యాదు కూడా నమోదు కాకపోవడం, రీపోలింగ్, రీకౌంటింగ్ అవసరం లేకపోవడం విశేషమని చెప్పారు. ఈ విజయానికి కారణమైన బీహార్ బీఎల్‌ఓలను ఆయన అభినందించారు.

**తెలంగాణ విస్తీర్ణం కెనడా కంటే పెద్దది..**

తెలంగాణ విస్తీర్ణం కెనడాకంటే పెద్దదని పేర్కొన్న గ్యానేశ్ కుమార్, సమగ్ర ఓటర్ల జాబితా శుద్ధి పూర్తయిన తర్వాత రాష్ట్రంలో ఎన్నికల పరిపాలన ఒక కొత్త యుగంలోకి అడుగుపెడుతుందని అన్నారు. బీఎల్‌ఓలతో జరిగిన పరస్పర చర్చలో పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా ఉండటానికి పట్టణ ఓటర్ల నిరాసక్తతే ప్రధాన కారణమని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ఓటర్లు మాత్రం ఉత్సాహంగా క్యూల్లో నిలబడి ఓటు హక్కును వినియోగిస్తూ దేశానికి దారి చూపుతున్నారని వ్యాఖ్యానించారు. భారతదేశంలో ఎన్నికలు పూర్తిగా దేశ చట్టాల ప్రకారమే నిర్వహించబడుతున్నాయని, ఎన్నికల చట్టాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాల్సిందేనని సీఈసీ స్పష్టం చేశారు. ఈ సమావేశానికి ముందు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి తన పరిచయ ప్రసంగంలో తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన కీలక గణాంకాలను వివరించారు. రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య, జిల్లాలు, ఎమ్మెల్యే నియోజకవర్గాలు, ఎంపీ నియోజకవర్గాలు తదితర వివరాలను సీఈసీ ప్రస్తావించారు. ఈ సమావేశంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, సీనియర్ డిప్యూటీ సీఈసీ పవన్ కుమార్ శర్మ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సందడిగా 'ఎట్ హోం'

- హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్ రెడ్డి

**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్21 :** హైదరాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఎట్ హోం కార్యక్రమం సందడిగా సాగింది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా రాష్ట్ర మంత్రులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. తేనీటి విందుతో పాటు పసందైన తెలంగాణ వంటకాలకు అతిథులు ఫిదా అయ్యారు. చక్కని ఆతిథ్యం ఇచ్చారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభినందించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏర్పాటు చేసిన తేనీటి విందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, స్పీకర్ ప్రసాద్ రావు, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్ , కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయతో పాటు బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పాల్గొన్నారు. ఆనవాయితీ ప్రకారం రాష్ట్రపతి వేసవిలో సిమ్లాలో విడిది చేస్తారు. అలాగే శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌లో పర్యటిస్తారు. ఈ క్రమంలోనే ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ము డిసెంబర్ 17వ తేదీన భాగ్యనగరానికి వచ్చారు. సికింద్రాబాద్ పరిధి బొల్లారంలోని రాష్ట్రపతి భవన్‌లో బస చేశారు. హైదరాబాద్ వేదికగా పలు అధికారిక కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నారు. బొల్లారంలో నిర్వహించిన ఎట్ హోం కార్యక్రమంలో గవర్నర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ,పలువురు ప్రముఖులతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆత్మీయంగా మాట్లాడారు.

# ఉపరాష్ట్రపతికి ఘనంగా వీడ్కోలు

**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్21:** రెండు రోజుల పర్యటన నిమిత్తం హైదరాబాద్ వచ్చిన భారతదేశ ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఆదివారం ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా చేగురులోని కన్హా శాంతి వనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనకు మంత్రి శ్రీధర్ బాబు స్వాగతం పలికారు. అనంతరం శంషాబాద్ విమానాశ్రయం చేరుకున్న ఉప రాష్ట్రపతి ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, అడిషనల్ డీజీపీ లా అండ్ ఆర్డర్ మహేష్ భగవత్, ఇతర అధికారులు, పోలీస్ అధికారులు, ఘనంగా వీడ్కోలు పలికారు.

# మేడారం మహా జాతరకు రండి

- రాష్ట్రపతిని ఆహ్వానించిన మంత్రులు సురేఖ, సీతక్క, అడ్లూరి

**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్21:** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన సమ్మక్క, సారలమ్మ జాతరకు రావాలని రాష్ట్రపతిని మంత్రులు సురేఖ, సీతక్క, అడ్లూరి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మేడారం మహా జాతరకు రావాలంటూ ఆమెకు ఆహ్వాన పత్రికను అందజేసి, ఆహ్వానం పలికారు. రాష్ట్రపతికి సమ్మక్క తల్లి చీరను, కంకణం, కండువ బంగారాన్ని మంత్రులు అందజేశారు. మేడారం ఘనతను, జాతర విశిష్టతను, సమ్మక్క సారాలమ్మ తల్లుల పోరాటాన్ని, త్యాగాన్ని, అభివృద్ధి పనులను మంత్రి సీతక్క రాష్ట్రపతికి వివరించారు. మేడారం జాతర విశేషాలను రాష్ట్రపతి ఆసక్తిగా విన్నారు. ఈ మహా జాతరకు వచ్చేందుకు కచ్చితంగా ప్రయత్నిస్తానని ఆమె తెలిపారు. అనంతరం మంత్రులకు ఆమె ఆప్యాయంగా నూతన వస్త్రాలను బహుకరించారు.

# మోడీ పంపిన 'చీటీ' ప్రకారమే కేసీఆర్ కదలికలు

- పార్టీ కార్యాలయానికి కాదు, అసెంబ్లీకి రావాలి
- ప్రభుత్వ విప్, కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్

**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 21:** ప్రభుత్వ విప్, కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్ పార్టీ కార్యాలయానికి రావడం కాదు, అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ బీజేపీ మధ్య 'చీకటి దోస్తానా' ఉందని ఆయన ఆరోపించారు. ప్రధాని మోదీ కేసీఆర్‌కు ఒక 'చీటీ' పంపారని, ఆ పని చేయడానికే కేసీఆర్ ఇప్పుడు బయటకు వచ్చారని సంచలన వ్యాఖ్యలు చేశారు. 'మునిగిపోతున్న పార్టీని కాపాడుకోవడం కోసమే కేసీఆర్ బయటకు వచ్చారు. ప్రజల కోసం కాదు. మోదీ.. కేసీఆర్ ఆరోగ్యంపై ఆరా తీయడం దేనికి సంకేతం? ఇంకా ఎంతకాలం ఈ చీకటి దోస్తానా చేస్తారు?" అని ప్రశ్నించారు. గతంలో నల్ల చట్టాలకు బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిందని, ఉపాధి హామీ పథకం నుంచి గాంధీ పేరు తొలగిస్తే బీఆర్ఎస్ నాయకులు నోరు మెదపకపోవడాన్ని విమర్శించారు. కేసీఆర్‌వస్తే అసెంబ్లీలో చర్చిద్దామని సవాల్ విసిరిన ఆది శ్రీనివాస్, ఎనిమిది లక్షల కోట్ల అప్పులు, కాళేశ్వరం ప్రాజెక్ట్ కూలిపోవడం వంటి అంశాలపై కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కృష్ణాగోదావరి జలాలను రాయలసీమకు మళ్లిస్తానని మాజీ మంత్రి రోజా ఇంటికి వెళ్లి కేసీఆర్ చెప్పారని, దీనికి తెలంగాణ ప్రజలకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలని ఆయన అన్నారు.

# కేసీఆర్, హరీశ్‌వల్లే నదీజలాల సమస్యలు

- కేసీఆర్‌ప్రజా జీవితంలో ఉంటే సంతోషమే
- కానీ ఆయన అసెంబ్లీకీ రావాలి
- కవిత గురించి కేసీఆర్‌ఏం వివరణ ఇస్తారు?
- రాష్ట్రంలో అప్పులపై ఏం సంజాయిషీ ఇస్తారు?
- తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 21:** కేసీఆర్, హరీష్ రావు చేసిన తప్పిదాల వల్లే తెలంగాణ రాష్ట్రంలో నదీజలాల సమస్యలు ఉత్పన్నమైనాయని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ విమర్శించారు. వృథా ప్రాజెక్టుల కోసం కేసీఆర్ అనవసరపు ఖర్చు చేశారని ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ స్పందించారు. కేసీఆర్ ప్రజా జీవితంలో ఉంటే సంతోషమేనన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి రావాలని తాము కోరుకుంటున్నామని పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఆయన కుమార్తె కల్వకుంట్ల కవిత గురించి కేసీఆర్ ఏం వివరణ ఇస్తారో చూద్దామని తెలిపారు. అలాగే రాష్ట్రంలో గతంలో చేసిన అప్పులపై కేసీఆర్ ఏం సంజాయిషీ ఇస్తారో వేచి చూద్దామని చెప్పారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలు ఉండాలని కాంగ్రెస్ కోరుకుంటుందని తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో తాము 70 శాతం గెలిచామని పేర్కొన్నారు. ఇక బీఆర్ఎస్ ఎక్కడుంది? అంటూ ఆయన ప్రశ్నించారు.

**కిషన్ రెడ్డి తెలంగాణకి తెచ్చింది ఏమైనా ఉందా?**

తెలంగాణ రాష్ట్రం పట్ల కేంద్ర మంత్రి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి అనుసరిస్తున్న వైఖరిపై నిప్పులు చెరిగారు. కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి తెలంగాణకి తెచ్చింది ఏమైనా ఉందా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. కేంద్రంలో మీ 12 ఏళ్ల పాలనపై.. తెలంగాణలో తమ రెండేళ్ల పాలనపై చర్చకు సిద్ధమా? అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సవాల్ విసిరారు. రాష్ట్ర అభివృద్ధికి కిషన్ రెడ్డి మోకాలు అడ్డు పెడుతున్నారంటూ మండిపడ్డారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అడ్డుకున్నారని విమర్శించారు. సోనియా గాంధీ ఇచ్చిన హామీల్లో మెజార్టీ అంశాలను ఇప్పటికే తాము నెరవేర్చామని ఆయన స్పష్టం చేశారు.

# కోడి గుడ్డు @రూ.8

- ఆకాశాన్నంటిన ధర
- పౌల్ట్రీ చరిత్రలోనే ఇదే అత్యధికం
- ఉత్పత్తి తగ్గడం వల్లే అంటున్న వ్యాపారులు

**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్21:** కోడి గుడ్డు ధర ఆకాశాన్నంటింది. కొద్ది నెలల క్రితం రూ.5 నుంచి రూ.6 వరకు పలికిన కోడి గుడ్డు ధర ప్రస్తుతం రూ.8కి చేరింది. హోల్ సేల్ మార్కెట్ లోనే ఒక్కో కోడి గుడ్డు రూ.7.30పై పలుకుతుండడం గమనార్హం. పౌల్ట్రీ రంగ చరిత్రలోనే ఇదే రికార్డు ధరని పౌల్ట్రీ రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. గతంలో 30 కోడిగుడ్లు రూ.160-170 వరకు విక్రయించేవారు. 10 రోజులుగా 30 కోడి గుడ్లను రూ. 210-220 వరకు హోల్ సెల్ మార్కెట్ లోనే విక్రయిస్తున్నారు. నాటు కోడి గుడ్లు అయితే ఒక్కో గుడ్డును రూ.15 వరకు విక్రయిస్తున్నారు. డిమాండ్‌కు తగిన ఉత్పత్తి లేకపోవడం వల్లే కోడి గుడ్ల ధరలు పెరిగిపోతున్నాయని పౌల్ట్రీ పరిశ్రమ ప్రతినిధులు చెబుతున్నారు. గతంలో తెలుగు రాష్ట్రాల్లో కలిపి రోజుకు సుమారు 8 కోట్ల గుడ్లు ఉత్పత్తి అయ్యేవి. అయితే, కోడి గుడ్ల ఉత్పత్తికి అవసరమయ్యే దాణ, మక్కలు, చేపపొట్టు వంటి వాటి ధరలు పెరిగిపోవడంతో చాలా మంది పౌల్ట్రీ రైతులు కోళ్ల ఫారాల నిర్వహణ ఆపేశారు. దీంతో గుడ్ల ఉత్పత్తి తగ్గిపోయింది. ఒకప్పుడు ప్రతి రోజు కనీసం 20 కోట్ల గుడ్లు కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ ఉండేవని ఇప్పుడా పరిస్థితి లేదని పౌల్ట్రీ పరిశ్రమ ప్రతినిధులు చెబుతున్నారు.

# రాష్ట్రంలో హేట్ స్పీచ్ బిల్లును వ్యతిరేకిస్తాం

- బీజేపీ నేతలు, కార్యకర్తలను వేధించడానికే బిల్లు
- హిందువులు నోరు మూయించడమే దాని లక్ష్యం
- వాస్తవానికి హేట్ స్పీచ్ ఇస్తున్నది కాంగ్రెస్ నేతలే
- ఓటీపీ పాలిటిక్స్‌ను ప్రజలు నమ్మరు
- బీఆర్ఎస్ ను ప్రజలు మర్చిపోయారు
- బీజేపీ స్టేట్ చీఫ్ రాంచందర్ రావు

**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 21:** కర్ణాటకలో ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదించిన హేట్ స్పీచ్ బిల్లు-2025 తరహాలోనే, తెలంగాణలో కూడా సారూప్యమైన చట్టాన్ని అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నారని, ఈ ప్రతిపాదనను భారతీయ జనతా పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. ఈ హేట్ స్పీచ్ చట్టం అనేది వాస్తవానికి బీజేపీ కార్యకర్తలను, బీజేపీ నాయకులను వేధించడానికి, వారిని తిరగకుండా చేయడానికి, మాట్లాడకుండా నోరు మూయించడానికి మాత్రమే తీసుకువస్తున్న చట్టంగా భావిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హిందువులను తిట్టేవాళ్లకు మద్దతుగా బిల్లు తెస్తోందని, హిందువులపై, సనాతన ధర్మంపై విమర్శలు చేసే వారిని, హిందూ ధర్మాన్ని, దేవీదేవతలను హేళన చేసే వారిని కాపాడేందుకు ఈ బిల్లు తీసుకురావాలని ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. అందుకే ఈ బిల్లును బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని అన్నారు. ఈ చట్టం అసలు లక్ష్యం హిందువులు ఏం మాట్లాడకుండా చేయడం, హిందూ ధర్మస్వరాన్ని అణచివేయడమేనని అన్నారు. "ముస్లిం ఈజ్ కాంగ్రెస్..కాంగ్రెస్ ఈజ్ ముస్లిం" అని మాట్లాడింది కూడా కాంగ్రెస్ నాయకులేనని, హిందూ ధర్మాన్ని, సనాతన ధర్మాన్ని, హిందూ దేవీదేవతలను హేళనగా, అసభ్యంగా మాట్లాడింది కూడా కాంగ్రెస్ పార్టీ, ఇండీ అలయెన్స్ పార్టీలేనని అన్నారు. వాస్తవానికి హేట్ స్పీచ్ ఇస్తున్నది కాంగ్రెస్ పార్టీ, విద్వేషాన్ని పుట్టిస్తున్నది కాంగ్రెస్, ఇండీ అలయెన్స్ పార్టీలేనని, అలాంటి పార్టీ ఇప్పుడు విద్వేషాలకు వ్యతిరేకంగా హేట్ స్పీచ్ చట్టం తీసుకొస్తామంటూ మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు.

**బీఆర్ఎస్ ను ప్రజలు మర్చిపోయారు**

తెలంగాణలో రాజకీయాలు మారుతున్నాయని బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కొన్ని నెలల తర్వాత మళ్లీ ప్రజాక్షేత్రంలోకి వచ్చారని, రాజకీయాల్లో మళ్లీ మార్పు వస్తుందని చెబుతున్నారని, కానీ తెలంగాణలో ఓటీపీ పాలిటిక్స్ నడవవు అని రాంచందర్ రావు అన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిని, ఫ్యూడలిజాన్ని, వారి పాలనా పనితీరును తెలంగాణ ప్రజలు స్పష్టంగా చూశారని, అందుకే బీఆర్ఎస్ పార్టీని ప్రజలు మర్చిపోయారని అన్నారు. ఓటీపీ పాలిటిక్స్‌ను ప్రజలు నమ్మరని, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం ఒక్క బీజేపీ పార్టీయేనని అన్నారు.

ఓపెన్ వాయిస్

సాహిత్యం

# 'సాహిత్యంలో వెలుగుచున్న చిటికెన'

**కథలు రచించడం, స్ఫూర్తిదాయక సందేశాలు అందించడం, సమాజ శ్రేయస్సుకు యువతను ప్రోత్సహించడం వారి దినచర్య. "డా.వడ్డేపల్లి కృష్ణ జాతీయ సాహిత్య తొలి పురస్కారం అందుకున్న డా. చిటికెన కిరణ్ కుమార్ ధన్యుడు". ఆయన కలం కేవలం కథలు, కవితలు, వ్యాసాలకే పరిమితం కాలేదు, అది సమాజాన్ని మేల్కొలిపే చైతన్య ధారగా ప్రవహించింది. జీవితం అనే అరణ్యంలో మనిషి అనుభూతుల తాళాలను గుర్తించి వాటిని అక్షరాల రూపంలో వర్ణించిన కిరణ్ కుమార్ గారి రచనల్లో హృదయ స్పందన స్పష్టంగా వినిపిస్తుంది.**

గడప రఘుపతిరావు
9963499282

తెలంగాణ సాహిత్య సముద్రంలో అక్షరాల తారకమై వెలుగుతున్న పేరు డాక్టర్ చిటికెన కిరణ్ కుమార్. సిరిసిల్లలో పుట్టిన ఈ రచయిత తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేక స్థానం సంపాదించారు. ఆయన కలం కేవలం కథలు, కవితలు, వ్యాసాలకే పరిమితం కాలేదు, అది సమాజాన్ని మేల్కొలిపే చైతన్య ధారగా ప్రవహించింది. జీవితం అనే అరణ్యంలో మనిషి అనుభూతుల తాళాలను గుర్తించి వాటిని అక్షరాల రూపంలో వర్ణించిన కిరణ్ కుమార్ గారి రచనల్లో హృదయ స్పందన స్పష్టంగా వినిపిస్తుంది. అనుక్షణం తపించడం,దానికి ఆలోచించడం కృషికి ఫలితం ఎన్నో అవార్డులు రివార్డులు అందులో మచ్చుకు కొన్ని.

ఆయన తొలి కథ "అనుబంధం"తోనే ఒక కొత్త దిశను చూపారు. ఆ కథలో మనిషి లోకంలో అనుబంధాల విలువ ఎంత ముఖ్యమో చూపిస్తూ, భావోద్వేగాల రసదారలో పాఠకుడిని నడిపించారు. తరువాత ఆయన రచించిన వ్యాసాలు, విమర్శలు, కవితలు అన్నీ సమాజ మార్పు పట్ల బాధ్యతా గురించి భవిష్యత్ భారత శ్రేయస్సుకు సంబంధించింది మాత్రమే.

వ్యాసాల ద్వారా ప్రజల్లో స్ఫూర్తి నింపవచ్చని నిరూపించిన "చైతన్య స్ఫూర్తి" అనే వ్యాస సంకలనం ఆయన ఆలోచనలకు ప్రతి రూపం. ప్రతి వ్యాసం ఒక అద్దంలా మన సమాజాన్ని ప్రతిబింబిస్తుంది. సమాజ సమస్యలపై ఆయన చూపే దృష్టి విశ్లేషణాత్మకమైనది, కానీ కఠోరంగా కాకుండా హృదయాన్ని తాకే మృదుత్వంతో నిండివుంటుంది. అదే ఆయన రచనల బలం.

జాతీయ స్థాయి ప్రశంశలు పొందిన మరో ఇతివృత్తం ఓ తండ్రి తీర్పు. ఆ కథ "ఓ తండ్రి తీర్పు" సినిమారూపం దాల్చి జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంది. ఆ చిత్రంలో తండ్రి మనసు, న్యాయ భావం, మానవ విలువల మధ్య సన్నివేశం ఆలోచింపజేస్తుంది. ఈ కథలోని అంతర్మధనం ఆయన రచనా లోతును ప్రతిబింబిస్తుంది.అది చూస్తే వారి ఆలోచన విధానం అర్థం అవుతుంది. ఆయన రచనలు దేశీయ సరిహద్దులను దాటి ప్రపంచ సాహిత్య వేదికలపై నిలిచాయి. అనేక దేశాల్లో నిర్వహించిన శాంతి సదస్సుల్లో ఆయన భారత దేశ ప్రతినిధిగా ప్రాతినిధ్యం వహించారు. సాహిత్యాన్ని ఆయుధంగా చేసుకుని ఆయన ప్రజా చైతన్యం, శాంతి భావం, సామాజిక అవగాహనల మధ్య వంతెనగా నిలిచారు. వందలాది పత్రికల్లో వేలాది కథలు, వ్యాసాలు, కవితలు ప్రచురింపబడి ఆయన సృజనాత్మకతకు సాక్ష్యమిచ్చాయి. అవార్డులు, గౌరవాలు ఆయనకు ఎన్నో లభించాయి, కానీ ఆయన దృష్టిలో నిజమైన గౌరవం పాఠకుడి మనసులో చోటు సంపాదించడం. డాక్టర్ కిరణ్ కుమార్ గారి రచనల్లో భాష సరళంగా ఉంటుంది, కానీ భావాలు గంభీరంగా విస్తరిస్తాయి. తెలంగాణ మట్టివాసన, మనిషి ఆత్మ, జీవన సంక్షోభాలు, సత్యాన్వేషణ .. ఇవన్నీ ఆయన అక్షరాలలో ముడిపడి ఉంటాయి. ప్రతి వాక్యంలో ఆలోచన, ప్రతి ఆలోచనలో విలువ.

అతని రచనలపై పరిశోధన చేసే విద్యార్థులు, పాఠకులు, విమర్శకులు అందరూ ఒకే మాట చెబుతారు. "చిటికెన కిరణ్ కుమార్ గారి అక్షరాల వెలుగే సమాజ మార్పు కోసం" అని. ఆయన కలం అజ్ఞానం మీద వెలుగుని ప్రసరించే దీపం లాంటిది. ఆయన రచనల శక్తి ఒక సాహిత్య మానవతా దిశగా సాగుతోంది. నేటి యువ రచయితలకు ఆయన ఒక మార్గదర్శి, సమాజానికి ఒక దిశానిర్దేశకుడు. సాహిత్యం అంటే కేవలం వ్రాతకాదు.. అది మనసుల మధ్య అనుబంధం అని ఆయన నిరూపించారు.

ప్రపంచం ఎక్కడికెళ్లినా, తెలుగు సాహిత్య కాంతిని తీసుకెళ్తున్న కిరణ్ కుమార్ గారి ప్రయాణం నిజంగా ప్రేరణాత్మకం. సాహిత్య ప్రపంచంలో ఆయన పేరే ఒక దీప్తి, ఆయన అక్షరాలే ఆ కాంతి.డాక్టర్ చిటికెన కిరణ్ కుమార్ గారి సాహిత్య యాత్రను చూస్తే, అది ఒక సాధన, ఒక శ్రద్ధ, ఒక విశ్వాసం. ఆయన రచనలు సమాజాన్ని కేవలం చూపించడమే కాదు, దాన్ని సరిచేయాలనే సంకల్పాన్ని ప్రతిబింబిస్తాయి. ఆలోచనలతో మనసును కదిలించే శక్తి ఆయన కలంలో ఉంది. ప్రతి పేజీలో ఆలోచనల సుగంధం, ప్రతి వాక్యంలో ఆత్మనాదం వినిపిస్తుంది. ఆయన సాహిత్య జీవితం ఎప్పుడూ కీర్తికోసం కాదు, కర్తవ్య భావంతో సాగింది. సాహిత్యం ఆయనకు వృత్తి కాదు. అది ఆత్మ సాధన. ఈ కాలపు మనిషి క్షణిక ఆశలలో నలుగుతున్నప్పుడు, కిరణ్ కుమార్ గారి రచనలు అతనికి మార్గదర్శక కాంతిలా నిలుస్తాయి. ఆయన రాసిన ప్రతి మాట మనసును ప్రశ్నిస్తుంది. "మనిషి విలువ ఏంటి?", "సమాజం ఎటు వెళ్తోంది?" అనే ప్రశ్నలతో మనలో జవాబులు వెతుక్కునే ప్రక్రియ మొదలవుతుంది.

తెలుగు భాషలో కొత్త అర్థాలను, కొత్త బంధాలను సృష్టించడమే ఆయన ప్రత్యేకత. ఆయన వచనం చదివినవారు అక్షరాల వెనుక ఉన్న ఆ మనిషిని అనుభూతి చెందుతారు. భావోద్వేగం, తాత్వికత, మానవతా విలువలు ఇవన్నీ ఒకే తాటిపై నడిచేలా ఆయన మాటలు మెలిపెడతాయి. ప్రపంచం వేగంగా మారుతున్న ఈ రోజుల్లో కూడా ఆయన రచనలు మన ఆత్మను నిలబెట్టే స్థిరమైన వృక్షంలా ఉంటాయి. ప్రతి తరం ఆయనను చదివినప్పుడు కొత్త అర్థం కనుగొంటుంది. అదే నిజమైన సాహిత్య శాశ్వతత్వం. డాక్టర్ కిరణ్ కుమార్ గారి రచనా ప్రస్థానం ఒక వెలుగు ...అది చీకటిలో తడబడే మనసులకు మార్గం చూపుతుంది. ఆ వెలుగు తీరని కాంతిలా సాహిత్య విశ్వంలో విరాజిల్లుతుంది. ఆయన సృష్టి కేవలం ఈ కాలానికే కాదు, రానున్న తరాలకు కూడా ప్రేరణగా నిలుస్తుంది. ఆయన అక్షరాలు మనిషి అంతరంగాన్ని తడిమి, మనసులో మౌనంగా వెలుగులు వెలిగిస్తాయి. ఆ వెలుగే సాహిత్య శక్తి. ఆ శక్తికే ఆయన రూపం. ఇలాంటి వారు నేడు సాహిత్య రంగంలో ఎంతో అవసరం.

**(వ్యాసకర్త రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత)**

పరిచయం

# హిందీ సాహిత్యంలో విలువల మెరుపు భీషమ్ సాహ్నీ

డా.టి.రాధాకృష్ణమాచార్యులు
9749305871

భారతదేశం బహుళత్వ సంస్కృతి, ప్రాపంచిక మూలాలకు భీషం సాహ్నీ చేషిన నిర్భయమైన ప్రతిజ్ఞను ఆయన రచనలు ప్రతిబింబిస్తాయి. అందులో ముఖ్యంగా 1947 భారత విభజన సమయంలో జరిగిన అల్లర్లు, హింస, మానవత్వపు సంక్లిష్టతను వర్ణించే ఒక క్లాసిక్ నవలను 1974లో భీషం సాహ్నీ 'తమస్'పేరుతో రచించిన నవల. తమస్ చీకటి, అజ్ఞానానికి ప్రతీక. ఇది దేశ విభజన నాటి భయానక వాస్తవాలను చిత్రించిన ఒక ముఖ్యమైన చారిత్రక సాహిత్య రచన కూడా. ఈ నవల ఆధారంగా గోవింద్ నిహలానీ దర్శకత్వంలో 1988లో 'తమస్' అనే పేరుతో ఒక టెలివిజన్ చిత్రం తీశారు. అది భీషమ్ సాహ్నీకి గొప్ప పేరు, గుర్తింపు తెచ్చి పెట్టింది కూడా.బ్రిటిష్ ఇండియా లోని రావల్పిండిలో ఆగష్టు 8, 1915 న జన్మించిన డా.భీషమ్ సహానీ గొప్ప హిందీ రచయిత, నాటకకర్త, నటుడు.ఆయన ప్రఖ్యాత హిందీ సినిమా నటుడు, పంజాబీ రచయిత బాల్‌రాజ్ సాహ్నీకి సొంత తమ్ముడు. ఆయన లాహోర్‌లోని ప్రభుత్వ కళాశాలలో ఎం.ఏ ఆంగ్ల సాహిత్యం చదివి స్నాతకోత్తర పట్టాను పొందాడు. పంజాబ్ విశ్వవిద్యాలయం, చండీగఢ్ నుండి 1958లోపి.హెచ్.డి.పట్టా పొందాడు.స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న భీషమ్ సాహ్నీ దేశవిభజన సమయంలో జాతీయ కాంగ్రెస్‌లో పనిచేశాడు. 1947 మార్చిలో దేశ విభజన సందర్భంలో అల్లరి మూకలు రావల్పిండిలో విధ్వంసకాండ సృష్టించినప్పుడు శరణార్థులకు సహాయ కార్యక్రమాలు చేపట్టిన మానవీయుడు.1948లో ఇతడు తన సోదరుడు బలరాజ్ సాహ్నీతో కలిసి ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా)లో దర్శకుడిగా, నటుడిగా పనిచేశాడు. ఇప్టాతో అనుబంధం మూలాన ఆయన కాంగ్రెస్ పార్టీ వీడి కమ్యూనిస్టు పార్టీలో చేరాడు. ఆయన బొంబాయి వదిలి పంజాబ్‌కు వెళ్లి అక్కడ మొదట అంబాలాలో ఒక కాలేజీలో లెక్చరర్‌గా కొంతకాలం పనిచేశాడు. ఆ పైన అమృత్‌సర్‌లోని ఖల్సా కాలేజీకి మారాడు. ఆ సమయంలో ఇతడు ఇప్టాతో పాటు పంజాబ్ కాలేజ్ టీచర్స్ యూనియన్ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొన్నాడు. 1952లో ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన ఢిల్లీ కాలేజి (ప్రస్తుతం జాకీర్ హుసేన్ కాలేజి)లో ఇంగ్లీషు అధ్యాపకునిగా ఉద్యోగంలో చేరి ఢిల్లీకి వచ్చాడు. 1956 నుండి 1963 వరకు మాస్కోలోని ఫారిన్ లాంగ్వేజస్ పబ్లిషింగ్ హౌస్‌లో అనువాదకుడిగా చేరిన ఆయన లియో టాల్‌స్టాయ్ వ్రాసిన కథలు, పునరుత్థానము అనే నవల వంటి ముఖ్యమైన రచనలను హిందీలోనికి అనువదించాడు. భారత దేశానికి తిరిగి వచ్చి ఢిల్లీ కాలేజీలో తిరిగి అధ్యాపకుడిగా కొనసాగి 1980లో పదవీ విరమణ చేసిన భీష్మ సాహ్నీ జూలై 11,2003న ఢిల్లీలో కన్నుమూశారు. ఇక ఆయన ప్రయాణంలో 19651967 నడుమ హిందీ సాహిత్య పత్రిక నయీ కహానియాకు సంపాదకునిగా ఉన్నాడు. ఆయనకు పంజాబీ, ఇంగ్లీషు, ఉర్దూ, సంస్కృతము, హిందీ భాషలు బాగా తెలుసు.భీష్మ సహానీ అనేక సాంస్కృతిక, సాహిత్య సంస్థలతో అనుబంధాన్ని కలిగివున్నాడు. అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘానికి ప్రధాన కార్యదర్శి (1975-85)గా, ఆఫ్రో ఆసియన్ రైటర్స్ అసోసియేషన్‌కు వ్యవహార కార్యదర్శిగా, ఆ సంస్థకు చెందిన పత్రిక లోటస్‌కు సంపాదకునిగా పనిచేశాడు. సఫ్దర్ హష్మి హత్యానంతరం అతని స్మారకార్థం ఏర్పాటైన సహ్‌మత్ అనే సంస్థకు వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉన్నాడు. 1987లో గోవింద్ నిహలానీ నవలను టెలీఫిల్మ్ గా మలిచాడు. భీష్మ సహానీ వ్రాసిన కథలలో 'పాలీ', 'అమృత్‌సర్ ఆ గయా హై' అనే రెండు కథలు కూడా దేశవిభజ

నకు సంబంధించిన ఇతివృత్తంలో రాసినవే.ఇక ఆయన రచనల్లో ఝరోఖే , కడియా, బసంతి, మయ్యాదాస్‌కి మారి 1987, కుంతో 1993, నీలూ,నీలిమా, నీలోఫర్ 2000లలో రాసిన ఆరు హిందీ నవలలు, వందలకొద్దీ కథలు, పది కథాసంపుటాలు, ఐదు నాటకాలు, గులాల్ కా కీల్ అనే బాలల కథాసంపుటి ఉన్నాయి. భీష్మసాహ్నీ తన జీవితచరిత్ర 'ఆజ్ కే అతీత్' అనే పేరుతో, తన సోదరుడు బలరాజ్ సహానీ జీవిత చరిత్రను ఇంగ్లీషులో 'బలరాజ్ మై బ్రదర్' పేరున రచించాడు.

**విస్తృత రచన చేసిన భీష్మ సాహ్నీ**

తన జీవితకాలంలో ఎన్నో పురస్కారాలను,సన్మానాలను పొందాడు. 1998 లో భారత ప్రభుత్వంచే సాహిత్యంలో ప్రతిష్టాత్మక భూషణ పురస్కారం అందుకున్న భీష్మసాహ్నీ జ్ఞాపకంగా 2017 మే 31న భారత తపాలాశాఖ ఒక తపాలా బిళ్ళను విడుదల చేసింది. 2019లో సాహిత్య అకాడమీ ఫెలోషిప్ పొందాడు. 2001 లో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డును,2002 లోఉత్తమ హిందీ కథా రచయితగా సర్ సయ్యద్ జాతీయ పురస్కారాన్ని అందుకున్నాడు. ఆయన శిరోమణి అవార్డు,1975 లో తమస్ నవలకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రప్రభుత్వ అవార్డు,రష్యాలో 2004లో జరిగిన అంతర్జాతీయ నాటకోత్సవాలలో మాధవి అనే నాటకానికి కలర్ ఆఫ్ నేషన్ అవార్డు పొందారు. ఇంకా 1975 లో ఆతని నాటకం హనుష్‌కు మధ్యప్రదేశ్ కళాసాహిత్య పరిషత్ అవార్డు,1981లో ఆఫ్రో ఏషియన్ రైటర్స్ అసోసియేషన్ వారి లోటస్ అవార్డు,1983లో సోవియట్ లాండ్ నెహ్రూ అవార్డు,1999లో శలాక సమ్మాన్, న్యూఢిల్లీ 2000లో మైథిలీ శరణ్ గుప్త సమ్మాన్, మధ్యప్రదేశ్ వారిది అందుకున్న గొప్ప రచయిత. డా.భీష్మ సాహ్నీ ప్రసిద్ధ హిందీ రచయిత, ఆంగ్ల అనువాదకుడుగా రాసిన గ్రంథాలన్నీ పాఠకులను ఎంతగానో ఆకట్టుకున్నవే.ఆయన కృషి ఎంతో గొప్పదిగా నిలిచింది.

కవిత



## ప్రకృతి

నిర్మలమైన మనసుతో చూడు
ప్రకృతి మాట్లాడుతుంది
గాలితో కలసి నాట్యం చేస్తు
పాటలే పాడుతుంది

కాలాన్నే మైమరిపిస్తుతోంది
మన తీపి జ్ఞాపకాలను తట్టిలేపుతుంది

కాని మన స్వార్ధ కార్యకలాపాల వల్ల
ప్రకృతి వైపరీత్యాలకు కారణమవుతున్నాం

తరుముకొస్తున్న ప్రళయాన్ని
ముంచుకొస్తున్న విలయాన్ని
కనిపెట్ట లేక పోతున్నాం

ప్రకృతి ఆరాధనే మన బ్రతుకుబాటకు పూలబాట
కాబట్టి మొక్కలు నాటుతు పకృతిని కాపాడుకుంటూ
సంతోష సిరుల ప్రకృతితో కలసి సాగుదాం

రచన మంజుల పత్తిపాటి
యాదాద్రి భువనగిరి జిల్లా
చరవాణి 9347042218

సాహిత్యం

# మీలోనూ ఓ అర్జునుడు ఉండవచ్చు

ఆచంట సుధాకళ్యాణి
8897129206

కెనడాలో సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తున్న యువ రచయిత "విజయ్ అప్పల్ల" తన నాలుగవ పుస్తకంగా 'అమలోద్భవిలో అర్జునుడు' అనే జానపద నవలను మన ముందుకు తీసుకొచ్చారు. తెలుగు సాహితీవనం ఆధ్వర్యంలో నవంబర్ 9, 2025 న హైదరాబాద్ లోని రవీంద్ర భారతి సమావేశ మందిరంలో ఈ నవలని ఆవిష్కరించారు. విజయ్ అప్పల్ల ఇంతకు ముందు "డీఎన్ఏ, డిటెక్టివ్ అలెక్స్, అర్జున్ సన్ఆఫ్‌సుజాతా రావు" మొదలైన నవలలను ప్రచురించారు. వేటికవే భిన్న నేపథ్యంతో రాసిన నవలలైనప్పటికీ చివరి వరకు ఉత్కంఠను కలిగిస్తూ చదవాలని అనిపించేలా రాయడం ఈ రచయిత ప్రత్యేకత.

ఈ జానపద నవల 'అమలోద్భవిలో అర్జునుడు' చదువుతుంటే గడచిపోయిన కాలం రెక్కలు కట్టుకుని మన ముందుకొచ్చినంత అబ్బురంగా అనిపిస్తుంది. 15వ శతాబ్దపు భారత దేశ చారిత్రక నేపథ్యంలో 'కులశేఖర రాజ్యం' అనే ఊహాజనిత సామ్రాజ్యంలో ధర్మాన్ని, రాజ్యాన్ని నిలబెట్టడానికి జరిగే పోరాటం, అందుకై అర్జునుడిలా ఎందరో వీరులు పడే ఆరాటమే ఈ కల్పిత కథ. విజయ నగర సామ్రాజ్యం నుండి విడివడి స్వతంత్ర రాజ్యంగా 'కులశేఖర రాజ్యం' ఆవిర్భావం, తరాలు మారుతున్నప్పుడు సింహాసనం కోసం కుటుంబ సభ్యుల మధ్య ఏర్పడే స్పర్ధ, చుట్టుపక్కల రాజ్యాల నుండి ఊహించని దాడులు. ఇంతటి విస్తృతి కలిగిన కథను సులభంగా, చదివే పాఠకులకు ఆసక్తి కలిగేలా చెప్పడానికి 18 అధ్యాయాలుగా విభజించారు. ఇందులోని పాత్రధారుల స్వభావాలను, ఉద్విగ్నతను కలిగించే సంఘటనలతో ముడిపెట్టి చదివే పాఠకుల కళ్ళ ముందు నిలిపారు. అది వంశ మూల పురుషుడు విజయ వర్మ అయినా, అతని వారసులు పరాక్రమ, విక్రమ వర్మలైనా ఒక సంఘటనకు ప్రతిస్పందించే తీరును బట్టి, తీసుకునే నిర్ణయాలను బట్టి ఒకే వాక్యంలో పాఠకుని ముందు సజీవంగా నిలబెట్టారు రచయిత. "మగవాని మాటకు పులి కదులుతుందేమో కానీ, స్త్రీ మొర పెట్టుకుంటే ఆ ఆకాశం రెండుగా చీలుతుంది." అనే మాట ఆ రాజ్యపు వారసత్వానికి, తొలి సంతానానికి ఎదురయ్యే శాపం గురించి చెపుతూ, స్త్రీని మోసపుచ్చడం ఎంత అనర్ధమో చెపుతుంది. "తన మాటతో, చూపుతో ధైర్యాన్నిస్తూనే నవ్వుతో కూడా యుద్ధాన్ని ఆపేవాడే నిజమైన రాజు " అనేది విజయవర్మ తన వారసుడు విక్రమవర్మకు చెప్పిన మాట. అతి బలవంతుడైన శత్రువు పులకేశిని ఎదుర్కొనేటప్పుడు, 'రుద్ర కవచం' కోసం రుద్రఘాటీ




అరణ్యంలో ఒంటరిగా సాహస యాత్ర చేసేటప్పుడు విక్రమవర్మ దీనిని అక్షరాలా పాటిస్తాడు. నాలుగు పాలనా మండళ్లు అంటూ సాగే ఓ అధ్యాయం, ఆ కాలంలో రాజ్య నిర్వహణను, అభివృద్ధిని ఓ పద్ధతిగా నడిపిస్తూ చరిత్రలో నిలిచిపోయిన కొందరు రాజులను గుర్తు చేస్తుంది. ఇందులోని ప్రతీ పాత్ర తనదైన వ్యక్తిత్వం, చరిత్రను కలిగి ఉంటుంది. ఒక పాలనా మండలికి నాయకుడైన అంధుడు పల్లెంరాజు త్యాగం, ధైర్యం అబ్బురపరిస్తే, మరో మండలికి నాయకుడైన శివరామవర్మ జీవితంలో రాచరికపు ఒత్తిళ్ళు రాజేసిన అశాంతి బాధను కలిగిస్తుంది. దుఃఖాన్ని జయించి ముందుకు సాగడానికి నిశ్చయించుకున్న యోధుల్లా సాగే వీరి కథ ఆసక్తికరంగా ఉంది. అసలు రాజకీయం, అధికారము అంటేనే ఎన్నో సవాళ్ళు ఉంటాయి. కొన్ని సార్లు ఆ సవాళ్ళు కుటుంబ సభ్యుల నుండైతే, కొన్ని సార్లు పరాయి రాజుల నుండి ఉంటుంది. సింహాసనం కోసం నైతిక విలువల గీతను కూడా దాటే కుటుంబ సభ్యులను, అంతఃపుర ప్రతిష్టకు భంగం కలుగకుండా రాజు విక్రమవర్మ కట్టడి చేసే తీరు రక్తం చిందించని యుద్ధం.. ప్రతి అధ్యాయంలో ఓ కొత్త మలుపు, ఆ వెనువెంటనే ఓ యుద్ధం... రాజు విక్రమ వర్మ కోసమే కాక చదివే పాఠకుడి కోసం కాచుకుని ఉన్నాయి.99 ఏళ్ల పాటు స్వతంత్ర ప్రతిపత్తి కోరిన కులశేఖర రాజ్యం, ఓ అనుమానాస్పద లేఖ, అజ్ఞాత నిధి కోసం ఆఫ్రికా రాణి అత్యాశతో కయ్యానికి కాలుదువ్వడం ఇవన్నీ ముడి పెడుతూ ఎన్నో మలుపులతో సాగే చివరి అంకం, చదివే పాఠకుడిలో ఆసక్తిని, ఉత్కంఠను కలిగిస్తుంది. ఈనాటి పాఠకుల, ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా ప్రధాన పాత్రధారిని మహాభారత గాథకు ముడిపెట్టిన సంఘటన కొసమెరుపు!!

జీవితమనే కురుక్షేత్రంలో, స్వధర్మాన్ని గాండీవంగా ముందుకు సాగమని సందేశమిచ్చే ఈ కథలో ధర్మానికి కట్టుబడిన అర్జునులు ఒకరి కన్నా ఎక్కువ ఉన్నారు. అపూర్వమైన నిధినిక్షేపాలు, రాజ్యాధికారం, రుద్ర కవచం వంటి అపూర్వ వస్తువులు కూడా ఆ ధర్మ దీక్షకులకు పరీక్షలే కానీ ఆటంకాలు కాదు! ఈ కథలో ఎదురయ్యే ఎన్నెన్నో మలుపులు కూడా, ఉత్కంఠ భరితమైన కథను ఆస్వాదించడానికి పునాదులే కానీ, చదివే పాఠకునికి ఆటంకాలు కాదు. మధ్య, మధ్య కాస్త విరామం తీసుకుని చదివినా కూడా, తదుపరి అధ్యాయం మొదలుపెట్టేటప్పుడు తన ఆకట్టుకునే రచనా శైలితో పాఠకులను కథలో లీనమయ్యేలా చేస్తారు రచయిత. శతాబ్దాల క్రితం జరిగినట్లు ఓ కల్పిత కథను అక్షరీకరించి ఈ తరానికి కూడా అర్థమయ్యేలా మన ముందుకు తీసుకొచ్చిన "విజయ అప్పల్ల" కృషికి తగిన విజయం లభించాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను. ఈ పుస్తక ఆవిష్కరణకు, పుస్తక పరిచయానికి తోడ్పాటు అందించిన తెలుగు సాహితీవనం వారికి హృదయపూర్వక ధన్యవాదాలు.

**ఈ పుస్తకం కాపీల కొరకు**
**vja0526@gmail.com**
**www.telugubooks.in/products/amalaodbhavilo-arjunudu**

## రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

## రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
90102 23917

**ADRESS**
Editor,
Prathipaksham,
Telugu Daily
# 8-1-284/OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

# వైన్‌షాపు తొలగించాలని రోడ్డెక్కిన కాలనీవాసులు

- భారీ ర్యాలీతో చిన్నారులు, కాలనీ వాసులు నిరసన
- బలవంతంగా షాపును మూసివేయించిన స్థానికులు

**ప్రతిపక్షం, రంగారెడ్డి ప్రతినిధి,డిసెంబర్ 21:** ఉప్పల్ భగాయత్ లో కొత్తగా ఏర్పాటు చేసిన వైన్ షాపును అక్కడి నుంచి తరలించాలని ఆదివారం కాలనీవాసులు, మహిళలు, చిన్నారులు ఆందోళనకు దిగారు. ఆదివారం ఫ్లెక్సీలు, ప్లకార్డులతో భారీ ర్యాలీ నిర్వహించి వైన్ షాప్ ముందు శాంతియుతంగా నిరసన తెలిపారు. అనంతరం అక్కడ మహాధర్నా నిర్వహిచంగా, వారికి వివిధ పార్టీలు, మహిళా సంఘాలు మద్దతు ప్రకటించారు. ఒక పక్క ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నా.. మరోపక్క వైన్ షాప్ మూసి వేయకపోవడంపై కాలనీ వాసులంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మూసివేయాలని షాపువైపు దూసుకుపోయారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకొని సముదాయించే ప్రయత్నించారు. ఈక్రమంలో ఆందోళన తీవ్రతరం కావడంతో పోలీసులు తాత్కాలికంగా వైన్ షాప్ మూసివేయించారు. ఆ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ, ఉప్పల్ భగాయత్ అసోసియేషన్ నేతలు మేకల మధుసూదన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు మాట్లాడుతూ... కాలభైరవ ఆలయానికి సమీపంలో, రెసిడెన్షియల్ ఏరియాలో వైన్ షాపు ఏర్పాటు సరికాదన్నారు. రోడ్లపై మద్యం తాగుతూ.. గొడవలకు దిగుతున్నారనీ, మరోపక్క ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని చెప్పారు. మద్యం షాపును మూసివేయించాలని కోరుతూ ఇప్పటికే ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుపోయామని, అయినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి.. భగాయత్ లో ఏర్పాటు చేసి వైన్ షాపును శాశ్వతంగా మూసివేయాలని లేకపోతే ఆందోళనలు తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భగాయత్ అసోసియేషన్ నేతలు ఫణిందర్, గండ్ర నవీన్, సందీప్ రెడ్డి, రాము, సందీప్, మంజుల, చంద్రశేఖర్‌రెడ్డి, గాయత్రి, స్వప్న, మాధవి, భాగ్య, కీర్తన, గణేష్, శ్రీహరి, అర్జున్‌రెడ్డి, ధర్మారెడ్డి, హన్మంతరెడ్డి, జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మేడారం మహా జాతర-2026 పోస్టర్ ఆవిష్కరణ

**ప్రతిపక్షం, హనుమకొండ, డిసెంబర్ 21:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో ఆదివారం మేడారం జాతర 2026 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు. తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే మేడారం మహా జాతర-2026 జనవరి 28 నుండి 31 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహా జాతరను శాంతియుతంగా, సవ్యంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ప్రభుత్వం సమర్థవంతంగా చేపడుతుందని ఈ సందర్భంగా సీఎం, మంత్రులు స్పష్టం చేశారు.

# దైవ చింతనను అలవర్చుకోవాలి

- ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి

**ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 21 :** ప్రతి ఒక్కరు దైవ చింతనను అలవర్చుకోవాలని ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా బీరంగూడలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి గోశాల 15వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని గో పూజ, పూర్ణహుతి కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భగవంతుని దయ అందరిపై ఉండాలని, అందరూ సుఖశాంతులతో సంతోషంగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి బిజెపి సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి, తదితరులు పాల్గొన్నారు.

# ట్రెసా అధ్యక్షులుగా వంగ రవీందర్ రెడ్డి

- ప్రధాన కార్యదర్శిగా కె. గౌతమ్ కుమార్
- రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 21:** తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం హైదరాబాద్‌లోని మూసారం బాగ్, రెవెన్యూ భవనంలో నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని 33 జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సీసీఎల్ఏ అధ్యక్ష, కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సమావేశంలో రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై కూలంకషంగా చర్చ జరిగింది. అనంతరం ట్రెసా కేంద్ర సంఘ ఎన్నికలను నిర్వహించి, 2025-28 కాలానికి నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ ఎన్నికల్లో వంగ రవీందర్ రెడ్డి మూడోసారి రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కె. గౌతమ్ కుమార్‌ను ఎన్నుకున్నారు. అసోసియేట్ ప్రెసిడెంట్లుగా పి. రాజ్ కుమార్, మహమ్మద్ రియాజుద్దిన్, కోశాధికారిగా డి.వి. రావ్ ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్లుగా కె. నిరంజన్ రావు, సి.ఎల్.బి. శాస్త్రి, మాధవి రెడ్డి, కె. నాగమణి, ఆర్. మనోహర్ చక్రవర్తి, కె. శ్రీనివాస్ రావు, గుర్రం శ్రీనివాస్ ఎన్నికయ్యారు. సెక్రెటరీలుగా జగన్మోహన్ రెడ్డి, టి. వాణిరెడ్డి, సీహెచ్. కృష్ణచైతన్య, బి. శ్యాం సుందర్ రెడ్డి, జింక జయంత్, వి. కృష్ణప్రసాద్, డి. వాణి ఎన్నికయ్యారు. స్పోర్ట్స్ , కల్చరల్ సెక్రటరీగా దేశ్యా ఎన్నికయ్యారు. ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా సి. గోవర్ధన్, కె. శ్రావణ్ కుమార్, సయ్యద్ మునీర్, షేక్ జమీరుద్దీన్, ఇ. కిషన్ ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీలుగా చంద్రశేఖర్, వి. వెంకటేశ్వర్లు, బి. రాములు, కిషన్, పి. అయ్యప్ప, మహమ్మద్ షఫీయుద్దిన్, కె. కృష్ణ, ఎం. రాజేశ్వర్ రెడ్డి, ఆర్. శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఎన్నికయ్యారు.

# ఘనంగా చింతకుంట ధర్మరాజు శతజయంతి

**ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 21 :** నిజామాబాద్ పట్టణంలోని ప్రసిద్ధ గోల్ హనుమాన్ ఆలయ నిర్మాణం కీలకపాత్ర పోషించిన స్వర్గీయ చింతకుంట ధర్మరాజు శతజయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ధర్మరాజు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చింతకుంట ధర్మరాజు భక్తి, సేవ, సామాజిక బాధ్యత అనే విలువలను జీవితాంతం పాటించిన మహానుభావుడని కొనియాడారు. నిజామాబాద్ పట్టణానికి ఆధ్యాత్మిక గుర్తింపుగా నిలిచిన గోల్ హనుమాన్ ఆలయాన్ని వలయాకారంలో నిర్మించటం రాష్ట్రంలోనే అరుదైన విషయం అని తెలిపారు. ఇలాంటి ఆలయం తెలంగాణ రాష్ట్రంలో మరెక్కడా లేదన్నారు. గోల్ హనుమాన్ ఆలయ నిర్మాణంలో ధర్మరాజు కీలక పాత్ర పోషించారని, సనాతన ధర్మ వ్యాప్తికి ఆయన చేసిన సేవలు అనిర్వచనీయమని అన్నారు. యువత ధర్మరాజు అడుగుజాడల్లో నడిచి విద్య, సేవ, సమాజహితాన్ని అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చింతకుంట ధర్మరాజు కుమారులు చింతకుంట రాజేందర్ , చింతకుంట రవీందర్, గోల్ హనుమాన్ టెంపుల్ చైర్మన్ బండారి నరేష్ , ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్, ఉదయ్ మహారాజ్, మాణిక్ భవన్ అధ్యక్షులు పెద్ది సంగమేశ్వర్ గుప్తా , న్యాలం మోహన్ రావు , మాధవరావు తదితర ప్రముఖులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# హోరాహోరీగా సాగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

**ప్రతిపక్షం, హనుమకొండ, డిసెంబర్ 21:** రానున్న రోజుల్లో కబడ్డీ స్టేట్ లెవల్ క్రీడలు వరంగల్ జిల్లాలో జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు మహమ్మద్ అజీజ్ ఖాన్ అన్నారు..హసన్ పర్తి మండలం చింతగట్టు గ్రామంలో జరిగిన జిల్లా స్థాయి సీనియర్ కబడ్డీ టోర్నమెంట్ ముఖ్య అతిథిగా హాజరయిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు మహమ్మద్ అజీజ్ ఖాన్ గారు విజేతలకు బహుమతులు అందించారు.జిల్లాలో జరిగిన ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు స్టేట్ లెవల్లో ఆడటానికి అర్హత సాధించారని అన్నారు..ఈ సందర్భంగా క్రీడాకారులకు అభినందనలు తెలిపారు... జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు సహకరించిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎరుకొండ శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలిపారు..ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ సెక్రెటరీ ఆకుల సారంగపాణి, ఉపాధ్యక్షుడు కృష్ణ రెడ్డి, సంపత్ రావు, అడ్వైజర్ బిన్నీ లక్ష్మణ్, జోన్ కబడ్డీ చైర్మన్ అటికం రవీందర్ ట్రెజరర్ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ అక్రమ్, రమేష్, రజిత, శంకర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# సోమవారం ప్రజావాణి రద్దు

**ప్రతిపక్షం రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 21:** జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండో సాధారణ పంచాయతీ ఎన్నికలు 2025 లో గెలుపొందిన సర్పంచ్, వార్డు సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నందున అధికార యంత్రాంగం ఆయా పనులలో నిమగ్నమై ఉంటారని పేర్కొన్నారు. ఈ కారణంగా ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని తెలిపారు.

# బీజేపీ సీనియర్ నాయకుడు ఆనంద్ అకాల మృతి పార్టీకి తీరని లోటు

- అంత్యక్రియల్లో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ

**ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 21 :** బీజేపీ సీనియర్ నాయకుడు, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం ఏడవ డివిజన్ శక్తి కేంద్ర ఇంచార్జ్ బీజేపీ సీనియర్ నాయకుడు బట్టిగిరి ఆనంద్ (45) అకాల మృతి పార్టీకి తీరని లోటని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. ఆనంద్ మరణించిన వార్త వినగానే ఎమ్మెల్యే హుటాహుటిన ఆయన ఇంటికి వెళ్లి మృత దేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. మధ్యాహ్నం వరకు అక్కడే ఉండి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే మాట్లాడుతూ బట్టిగిరి ఆనంద్ తనకు అత్యంత సన్నిహితుల్లో ఒకరని ఆయన అన్నారు. ఎప్పుడు హిందూ ధర్మం కోసం బీజేపీ పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తూ పార్టీకి ఒక సైనికుడిలా పనిచేశారని అన్నారు. ఆయన మరణించారని వార్త నమ్మలేకపోతున్నానని, పార్టీని తన కుటుంబ సభ్యులను వదిలినప్పటికీ ఆయన జ్ఞాపకాలు, పార్టీ కోసం చేసిన కృషి ఎప్పటికీ మర్చిపోనని అన్నారు. ఆనంద్ కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని ఏ చిన్న కష్టం వచ్చినా ఆదుకుంటానని ఎమ్మెల్యే ఆనంద్ కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఆనంద్ పవిత్ర ఆత్మ శాంతించాలని మనసారా కోరుకుంటున్నానని ఆయన వెల్లడించారు. బీజేపీ నాయకుడి ఆకస్మిక మృతితో పార్టీలో విషాదఛాయలు నెలకొన్నాయి. అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గారితో పాటు ఆనంద్ పార్థివ దేహానికి బీజేపీ పార్టీ సీనియర్ నేతలు, పుష్పగుచ్ఛాలతో శ్రద్ధాంజలి ఘటించారు. ఇదిలా ఉండగా సాయంత్రం జరిగిన ఆనంద్ అంత్యక్రియాల్లో ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొని ఆనంద్ పాడే మోసి అభిమానాన్ని చాటుకున్నారు.

# గీతంను సందర్శించిన ట్రిపుల్ ఐడీ హైదరాబాద్ మేనేజింగ్ కమిటీ

**ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 21 :** ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్ (ఐఐఐడీ), హైదరాబాదు ప్రాంతీయ చాప్టర్ యొక్క మేనేజింగ్ కమిటీ సభ్యులు అధికారక సందర్శనలో భాగంగా, హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ను ఇటీవల సందర్శించారు. సందర్శనలో భాగంగా, ఆర్కిటెక్చర్ స్కూల్ విద్యా వ్యవస్థ, అక్కడి స్థితిగతులు, కీలకమైన మౌలిక సదుపాయాలను కమిటీ సమీక్షించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టూడెంట్స్ వర్క్ ఎగ్జిబిషన్ ప్రధాన ఆకర్షణగా నిలవగా, కమిటీ సభ్యులు అక్కడున్న విద్యార్థులతో నేరుగా సంభాషించారు. ఆవిష్కరణ, డిజైన్ సున్నితత్వం, విద్యాపరమైన కఠోరతను ప్రతిబింబించే విద్యా ప్రాజెక్టుల ప్రత్యేక ప్రదర్శనను కూడా కమిటీ సభ్యులు వీక్షించారు. ట్రిపుల్ ఐడీ ప్రతినిధి బృందాన్ని ఉద్దేశించి గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ ఆర్. బందన్ కుమార్ మిశ్రా ప్రసంగించారు. ఆర్కిటెక్చర్ విద్యలో రాణించడానికి సంస్థ యొక్క నిబద్ధతను పునరుద్ఘాటించడంతో పాటు ట్రిపుల్ ఐడీ హైదరాబాదు చాప్టర్ సహకారం ప్రాముఖ్యతను ప్రముఖంగా ప్రస్తావించారు. అర్థవంతమైన విద్య, వృత్తిపరమైన సహకారాల ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్శనను అసిస్టెంట్ ప్రొఫెసర్ స్నిగ్ధ రాయ్ సమన్వయం చేశారు.

## భార్య మీద అనుమానంతో
# కన్న కొడుకుని చంపిన కసాయి తండ్రి



**ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 21:** భార్యాభర్తల మధ్య గొడవ భార్య మీద అనుమానంతో నాలుగు నెలల బాలుడిని ఉరివేసి చంపిన కసాయి తండ్రి వివరాలకు వెళ్తే మెదక్ జిల్లాలోని మెదక్ మండలంలో పెద్ద బాయి తాండ కు చెందిన భాస్కర్ కు మెదక్ మండలం తిమ్మక్క పల్లి గ్రామం లోని సంగాయ్ గూడ తాండకు చెందిన అమీనా తో వివాహం జరిగింది . కాగా వీరికి నాలుగు సంవత్సరాల బాలుడు ఉన్నాడు దంపతుల మధ్య తరచూ గొడవ జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది కొడుకు తనకు పుట్టలేదంటూ తరచూ గొడవ చేసే భాస్కర్ ఆదివారం సాయంత్రం ఇంట్లో ఒంటరిగా ఉన్న కొడుకుని చూసి ఉరివేసి చంపేశాడు స్థానికులకు పోలీసులు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బాలుడిని మెదక్ ఏరియా హాస్పిటల్ పోస్టుమార్టం నిమిత్తం తరలించారు బాలుని పరిశీలించగా ఉరివేసి చంపినట్లు ఆనవాళ్లు ఉన్నాయి భార్య అమీనా ఫిర్యాదు మేరకు మెదక్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. తనకు పుట్టలేదని అనుమానంతో మూడేళ్ల కొడుకుని తాడుతో హత్య చేసిన భాస్కర్ ప్రస్తుతం పరార్ లో ఉన్నట్టు పోలీసులు తెలిపారు బాలుడి మృతి చెందడంతో తండాలో విషేధచాయాలు అలుముకున్నాయి.

“

కేంద్రం, అస్సాంలో మోదీ ప్రభుత్వమే ఉంది. ప్రజలను రక్షించడంలో వాళ్లు విఫలమైతే ప్రతిపక్షాలను ఎలా నిందిస్తారు? మేం అక్కడ పాలిస్తున్నామా? ఆయన ఫెయిలై.. ప్రతిపక్షంపై తోస్తారు. వాళ్లే విధ్వంసకారులు. మేం కాదు. టెర్రరిస్టులనో, చొరబాటుదారులనో మేం సపోర్ట్ చేయడం లేదు. ప్రజలను కాపాడటంలో విఫలమై మాపై నిందలు వేస్తున్నారు.
- కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే

ప్రాంతీయం

## వీబీ జీ రామ్ జీ బిల్లు..
# వికలాంగుల జీవనోపాధి హక్కుపై దాడి

- ఎన్ఆర్ పీడీ ఆధ్వర్యంలో బిల్లు ప్రతులు దగ్ధం

**ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 21:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో వికసిత్ భారత్ - రోజ్‌గార్ మరియు ఆజీవికా మిషన్ గ్రామీణ్ బిల్లు, 2025 బిల్లు వికలాంగుల జీవనోపాధి పై తీవ్ర ప్రభావం చూపుతుందని, కేంద్రం తీసుకువచ్చిన బిల్లు రద్దు అయ్యే వరకు ఉద్యమం చేస్తామని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య హెచ్చరించారు. ఆదివారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మెదక్ జిల్లా ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విబిజి రామ్ జిబిల్లు పత్రాలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగం, భూమిలేని, పేదరికంలో ఉన్న వికలాంగులకు, గ్రామీణ ప్రాంతంలో ఉపాధికి కల్పించెందుకు ఉపాధి హామీ పథకం వచ్చిందని అన్నారు. నిధుల కొరత, పని నిరాకరణ, డిజిటల్ హాజరు వ్యవస్థలు మరియు పని ప్రదేశాలలో సరైన సౌకర్యాలు లేకపోవడం వలన వికలాంగులలో పని చేసే వారి సంఖ్య తగ్గితుందని అన్నారు. 202324 ఆర్థిక సంవత్సరంలో 6,38,088 మంది వికలాంగులకు ఈ పథకం కింద ఉపాధి కల్పించబడిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లు ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తుందని అన్నారు. గ్రామీణ వికలాంగ కార్మికుల జీవనోపాధి, గౌరవం మరియు మనుగడకు ముప్పు కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం గాంధీని చంపినా గాడ్సే వారసుల పేరుతో పథకాన్ని తీసుకురావడం సరైంది కాదని అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షణ కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు కె మల్లేశం, జిల్లా కార్యదర్శి కె యశోద, జిల్లా ఉపాధ్యక్షులు యాదగిరి, కె కవిత, గుమ్మడిదల శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు కిష్టయ్య, శ్రీనివాస్, మెదక్ పట్టణ అధ్యక్షులు శ్రీదేవి, కార్యదర్శి మున్నా, ఉపాధ్యక్షులు వెంకట్ నాయకులు సభనా, ఊసుఫోద్దీన్, నరేష్‌పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకం పేరు మార్పు దుర్మార్గం

- పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్.

**ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 21:** ఉపాధి హామీ పథకం పేరు మార్పు దుర్మార్గం అని పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని అజీజ్ నగర్ లో కాంగ్రెస్ శ్రేణులు ఆదివారం గాంధీ విగ్రహం వద్ద మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్పును నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ కార్యమాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా డీసీసీ అధ్యక్షులు చల్లా నరసింహ రెడ్డి అధ్యక్షతన చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ భీమ్ భరత్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ అజీజ్ నగర్ లో మహాత్మా గాంధీ విగ్రహం ముందు టీపీసీసీ ఆందోళన చేపట్టింది. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం పథకం పేరును వీ.బీ.జీ రామ్‌జీగా మార్చడం ప్రజా వ్యతిరేక విధానమని , దీనిని కాంగ్రెస్ పార్టీ ఖండిస్తుందన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి తలలేని మెండెంలాగా తయారు చేస్తూ పేరు మార్చడం అత్యంత దుర్మార్గమన్నారు. ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పథకం పేరు మార్చడమే కాకుండా, దాని స్ఫూర్తిని, అమలు విధానాన్ని కూడా మార్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంత పేదలకు ఉపాధి భరోసా కల్పించాలన్న మహాత్మాగాంధీ ఆలోచనలకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు. ఈ నిర్ణయం పేదలను, రాష్ట్రాలను శిక్షించే విధంగా ఉందని తీవ్రంగా విమర్శించారు. ఈ నిరసనలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గోపా సిద్ధిపేట జిల్లా నూతన కమిటీ ఎన్నిక

**ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 21:** గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) సిద్దిపేట జిల్లా నూతన కార్యవర్గాన్ని పట్టణంలోని తాడూరు బాల గౌడ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. సభ్యుల సమ్మతితో ప్రజాస్వామ్య పద్ధతిలో పూర్తిస్థాయి జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు.ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా బుర్ర తిరుపతి గౌడ్, ప్రధాన కార్యదర్శిగా పల్లె వంశీకృష్ణ గౌడ్, కోశాధికారిగా నేరేళ్ల కృష్ణమూర్తి గౌడ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా అంబాల ఐలయ్య గౌడ్, బోడిగే సురేందర్ గౌడ్, దూలం నరసింహులు గౌడ్, పల్లె శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ జి వైకుంఠం గౌడ్, అంబాల వెంకటేష్ గౌడ్, తాళ్ల అనూష గౌడ్ ఎన్నికయ్యారు.ఈ సమావేశానికి గోపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సాయన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి జీవి శ్రీనివాస్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఎల్మకంటి మీరయ్య గౌడ్, సాయి వేణు గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపా సంస్థ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ సంబరాలు జరుపుకుంటున్నట్లు తెలిపారు. గౌడ్ విద్యార్థులు, ఉద్యోగులు, ప్రొఫెషనల్స్ అభ్యున్నతే లక్ష్యంగా గోపా గత ఐదు దశాబ్దాలుగా సేవలు అందిస్తోందని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లాలో నూతనంగా ఎన్నికైన కమిటీ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ నెల 26న హైదరాబాద్‌లో నిర్వహించనున్న గోపా స్వర్ణోత్సవ సంబరాలకు సిద్దిపేట జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో సభ్యులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

# మల్లన్న ఆలయంలో భక్తుల కిటకిట

**ప్రతిపక్షం, కొమురవెల్లి, డిసెంబర్ 21:** కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తలతో కిటకిటలాడింది. ఆదివారం భక్తుల రాక పెరగడంతో ఆలయ పరిసరాలలో రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా భక్తులు మల్లికార్జునస్వామి వారి పుష్కరిణిలో పుణ్యస్నానమాచరించారు. సాంప్రదాయబద్ధంగా మల్లన్నకు బోనం చేసి చెలక, నజరు, ముఖమండప పట్నాలను వేసి మొక్కులు తీర్చుకున్నారు. పసుపు, బండారి, ఓడి బియ్యం సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. తమకోర్కెలు తీర్చలంటూ గంగిరేణి చెట్టుకు ముడుపులు కట్టి వేడుకున్నారు. కొమురవెల్లి శ్రీమల్లికార్జునస్వామిని దర్శించుకున్న అనంతరం క్యూలైన్లలో వెళ్లి మల్లికార్జునస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల కావల్సిన అవసరాలను ఆలయ ఈవో టంకశాల వెంకటేష్, ఏఈవో బుద్ది శ్రీనివాస్, ప్రధానార్చకులు మహదేవుని మల్లిఖార్జున్, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

# గ్రామాల అభివృద్ధికి సహకారం అందిస్తా

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

**ప్రతిపక్షం, దౌల్తాబాద్, డిసెంబర్ 21:** గ్రామాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని లింగాయి పల్లి తాండ లో (సోమవారం) నేటి నుంచి జగదాంబ అమ్మవారి ఆలయ జాతర జరగనుంది. ఆదివారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి లింగాయి పల్లి తాండ జగదాంబ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాండ గ్రామ సర్పంచ్ గా ఎన్నికైన లక్య నాయక్ ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ. బీఆర్ఎస్ మద్దతుతో సర్పంచ్ గా లాక్య నాయక్ ను ఎన్నుకున్న లింగాయి పల్లి తాండ గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందుప్రియల్ సర్పంచ్ గా ఎన్నికైన కొత్తింటి స్వాతి స్వామి, పాలకవర్గాన్ని శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సమన్వయకర్త రణం శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సయ్యద్ రహీమోద్దీన్, గువ్వలేగి సర్పంచ్ అల్లి శేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చేగుంట ఉపసర్పంచ్‌గా మహమ్మద్ రఫీ ఏకగ్రీవం

**చేగుంట,ప్రతిపక్షం,డిసెంబర్ 21:** చేగుంట మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ గా మహమ్మద్ రఫీ ఎన్నికయ్యారు. సర్పంచ్ గా సంద్రుగు స్రవంతి సతీష్ గెలుపొందారు. గ్రామపంచాయతీ పరిధిలోని 14 మంది వార్డు సభ్యులు పూర్తిస్థాయిలో మద్దతు ప్రకటించడంతో మహమ్మద్ రఫీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహమ్మద్ రఫీ చేగుంట మండల కేంద్రంలో ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టి పేదలకండగా నిలిచారు. దీంతో పూర్తిస్థాయిలో మెజార్టీ సభ్యులు రఫీ కి మద్దతు పలికారు.

# మందపల్లి సర్పంచ్ అర్చనా రెడ్డిని సన్మానించిన రెడ్డి సంఘం

**ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 21:** సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి గ్రామ సర్పంచ్ గా ఇటీవల ఎన్నికైన పన్యాల అర్చన శ్రీనివాస్ రెడ్డిని మందపల్లి గ్రామ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి సిద్దిపేట జిల్లా రెడ్డి జేఏసీ నాయకులు పాతూరు వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, నూతన సర్పంచ్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మందపల్లి రెడ్డి సంఘం అధ్యక్షులు బెంద్రం రాజిరెడ్డి, గౌరవ అధ్యక్షులు నేరెళ్ల వెంకటరెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి సర్పంచ్ అర్చన శ్రీనివాస్ రెడ్డి నాయకత్వం కీలకంగా ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. గ్రామ సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ గడ్డమీది మల్లారెడ్డి వెంకటమ్మతో పాటు డి. దుర్గా రెడ్డి, రాజ వెంకటరెడ్డి, మేఘనాథ్ రెడ్డి, రత్నాకర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, అంతిరెడ్డి వెంకట్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, రాంరెడ్డి, లింగారెడ్డి, మాధవరెడ్డి, రాజిరెడ్డి, మురలీధర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బాపురెడ్డి హనుమంత రెడ్డి తదితర రెడ్డి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# తపస్ జిల్లా అధ్యక్ష ,కార్యదర్శుల ఎన్నిక

**ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట డిసెంబర్ 21:** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సిద్దిపేట జిల్లా నూతన అధ్యక్ష కార్యదర్శులను ఆదివారం ఎన్నుకున్నారు. సిద్దిపేట పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ లో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సిద్దిపేట జిల్లా నూతన అధ్యక్షులుగా చిలుముల మురళీధర్, ప్రధాన కార్యదర్శిగా వంగ నర్సిరెడ్డి లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా దేశ్ భాస్కర్, హరిపురం రఘు వ్యవహరించారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు చిలుముల మురళీధర్ మాట్లాడుతూ... విద్యారంగ అభివృద్ధి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తపస్ నిస్వార్థ సేవలు అందిస్తుందని అన్నారు. ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా తపాస్ నిరంతర పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు మండలాల తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కోల్‌కతా 25 కె రన్‌లో సిద్ధిపేట వాసులు

**ప్రతిపక్షం, నంగునూరు, డిసెంబర్ 21:** పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్ కతాలో ఆదివారం జరిగిన కోల్ కతా 25కె రన్‌ను సిద్ధిపేట రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు విజయవంతంగా పూర్తి చేశారు. సిద్ధిపేట రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాజు, ప్రధాన కార్యదర్శి హరి, కోశాధికారి డాక్టర్ వీరన్న, సభ్యులు ఎస్.గోపాల్, గన్నె శ్రవణ్ రెడ్డి, లింగారెడ్డి, జీవన్ రెడ్డి, బోడ శ్రీనివాస్ కోల్ కతాలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక కోల్ కతా 25 కె రన్ పోటీలో పాల్గొనేందుకు సిద్ధిపేట నుంచి వెళ్లారు. వీరు కోల్ కతా 25 కె రన్ లో పాల్గొని 25 కిలోమీటర్ల పరుగును విజయవంతంగా పూర్తి చేశారని సిద్ధిపేట రన్నర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కత్తుల బాపు రెడ్డి తెలిపారు. రన్‌లో పాల్గొని సిద్ధిపేటకు గర్వకారణంగా నిలిచిన రన్నర్లు తమ క్రమశిక్షణ, పట్టుదల, శారీరక, మానసిక దృఢత్వాన్ని చాటి చెప్పారని పేర్కొన్నారు. వీరి విజయం యువతకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. వీరు భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి రన్నింగ్ ఈవెంట్లలో పాల్గొని సిద్ధిపేట పేరును మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రన్నర్లకు అభినందనలు తెలియజేశారు.

# గ్రామాల నుంచే బీజేపీ విజయగర్జన

- సిద్దిపేటలో ఘనంగా బీజేపీ ఆత్మీయ సన్మాన సభ
- ఎంపీ రఘునందన్ రావు

**ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 21:** సిద్ది పేట జిల్లా కేంద్రంలోని కొండా మల్లయ్య గార్డెన్‌లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లు, ఉప సర్పంచ్‌లు, వార్డ్ సభ్యులకు బీజేపీ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎవ్వరూ ఊహించని విధంగా బీజేపీ గొప్ప ఫలితాలు సాధించిందని, నమ్మిన సిద్ధాంతం కోసం కష్టపడ్డ నాయకులను గ్రామ ప్రజలు విశ్వసించి గెలిపించారని అన్నారు. బీజేపీ పట్టణ పార్టీ మాత్రమే కాదని, గ్రామాల్లోనూ బలమైన శక్తిగా ఎదుగుతుందని ఈ ఎన్నికలు నిరూపించాయని స్పష్టం చేశారు.దేశంలో మార్పు రావాలంటే యువత కీలక పాత్ర పోషించాలన్నారు. భవిష్యత్ ఎన్నికల్లో బీజేపీ మాత్రమే దిక్సూచి అని పేర్కొన్నారు. ఓటమి అనేది గెలుపుకు మెట్లని, విశ్వసనీయతను నిరూపించుకుంటే విజయం తప్పక సాధ్యమని ధైర్యం చెప్పారు.త్వరలోనే నితిన్ నబిన్ బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్నారని వెల్లడించారు. మోదీ ప్రభుత్వం కేంద్ర నిధులను నేరుగా గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమ చేస్తోందని, ఇది పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు.కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేసిన రఘునందన్ రావు, ఎంఎల్ఏలకు రావాల్సిన ఐదు కోట్ల రూపాయల నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని, అధికారంలోకి వచ్చి మాటలకే పరిమితమైందని ఆరోపించారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్స్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. బీజేపీలో గెలిచిన కొందరు ఇతర పార్టీల్లోకి వెళ్లడం బాధాకరమన్నారు. బీజేపీ తర్వాత కమ్యూనిస్టులకు మాత్రమే కొంత చిత్తశుద్ధి ఉందని వ్యాఖ్యానించారు. రాబోయే ఎన్నికల్లో మోదీ ప్రభుత్వం 33 శాతం మహిళా రిజర్వేషన్ తీసుకువస్తుందని వెల్లడించారు. సిద్దిపేట జిల్లా పరిషత్, మున్సిపాలిటీపై బీజేపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సిద్దిపేట ఎమ్మెల్యా ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ, ఆ ధోరణిని మానుకోవాలని హితవు పలికారు.భవిష్యత్ మనదేనని, అందరూ ధైర్యంగా ముందుకు సాగాలని రఘునందన్ రావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరీ శంకర్, విభూషణ్, బాసంగారి వెంకట్,కొత్తపల్లి వేణు, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉమా రెడ్డి,మార్కండేయులు, అంబటి బాలేష్, రామచంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బంగ్లాదేశ్‌లో హిందువులు ఐక్యంగా ఉండాలి. ప్రపంచవ్యాప్తంగా ఉన్నవారు వారికి అండగా నిలవాలి. హిందువులకు భారతదేశమే ఏకైక ఆశ్రయం. దీన్నిదృష్టిలో ఉంచుకొని భారత ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. పరిస్థితులను చక్కదిద్దడానికి ప్రభుత్వం తరపున మరిన్ని గట్టి చర్యలు అవసరం.
-ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్

# అంతర్గత వివాదాలకు స్థానిక నాయకులే బాధ్యులు

**ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 21:** కర్ణాటకలో నాయకత్వం మార్పు అంశంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై స్థానిక స్థాయిలోనే సమస్య ఉందని, పార్టీ అధిష్టానం ఎలాంటి గందరగోళం సృష్టించలేదని తెలిపారు. కలబురగిలో మీడియాతో ఆదివారంనాడు ఖర్గే మాట్లాడుతూ, హైకమాండ్ ఎలాంటి గందరగోళం సృష్టించలేదని స్పష్టం చేశారు. సమస్య స్థానిక స్థాయిలోనే ఉందని, అలాంటప్పుడు అధిష్టానంపై ఎలా నిందవేస్తారని ప్రశ్నించారు. అంతర్గత సమస్యలకు అధిష్టానంపై నిందలు వేయకుండా స్థానిక నాయకులే బాధ్యత వహించాలని అన్నారు. ఎన్నికల్లో పార్టీ విజయాన్ని ఏ ఒక్కరో ఆపాదించుకోవడం సరికాదని కూడా ఖర్గే వ్యాఖ్యానించారు. 'పార్టీ నిర్మాణంలో ప్రతి ఒక్కరి పాత్ర ఉంది. ఒక్కరి కృషి వల్ల ఏదీ కాదు. పార్టీ కార్యకర్తల వల్లే పార్టీ నిర్మాణం జరిగింది. కార్యకర్తలు పార్టీకి అండగా నిలిచారు. నాయకులు వ్యక్తిగత గొప్పలు చెప్పుకోకుండా కార్యకర్తల సమష్టి కృషిని గుర్తించాలి' అని ఖర్గే అన్నారు. అధిష్టానాన్ని కలుసుకునేందుకు డీకే శివకుమార్ ఢిల్లీ వెళ్తున్నారా అని అడిగినప్పుడు దానిపై తనకు ఎలాంటి సమాచారం లేదని ఖర్గే సమాధానమిచ్చారు. ఐదేళ్ల పదవీ కాలం పూర్తి చేసే విషయంలో అధిష్టానం మద్దతు తనకే ఉందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇటీవల అసెంబ్లీలో ధీమా వ్యక్తం చేసిన నేపథ్యంలో ఖర్గే తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## విశ్వ వీక్షణం

# రైల్వే టికెట్ చార్జీల పెంపు

- 26 నుంచి అమల్లోకి

**ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 21:** ఆరు నెలల వ్యవధిలో రైల్వే శాఖ మరోసారి ప్రయాణికుల చార్జీలు పెంచింది. పెరిగిన చార్జీలు ఈ నెల 26 నుంచి అమల్లోకి వస్తాయని ప్రకటించింది. సబర్బన్ రైలు ప్రయాణ చార్జీలు యథాతథంగా కొనసాగుతాయని తెలిపింది. ఆ శాఖ తెలిపిన వివరాల ప్రకారం 215 కిలోమీటర్ల ప్రయాణం వరకు జనరల్ క్లాస్ టికెట్ ధరల్లో మార్పు ఉండదు. అంతకన్నా ఎక్కువ దూరం ప్రయాణిస్తే, ప్రతి కి.మీ.కి ఒక పైసా చొప్పున చార్జీ పెరుగుతుంది. మెయిల్ లేదా ఎక్స్‌ప్రెస్ రైళ్లలో నాన్ ఏసీ క్లాస్ టికెట్ చార్జీలు ప్రతి కి.మీ.కి రెండు పైసల చొప్పున పెరుగుతాయి. ఏసీ క్లాస్ ప్రయాణానికి కూడా ప్రతి కి.మీ.కి రెండు పైసల చొప్పున టికెట్ చార్జీ పెరుగుతుంది. ఈ కొత్త చార్జీలు అమల్లోకి వస్తే, నాన్ ఏసీ క్లాస్‌లో 500 కి.మీ ప్రయాణానికి టికెట్ ధర రూ.10 పెరుగుతుంది. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో నాన్ ఏసీ ప్రయాణ టికెట్ చార్జీలు ప్రతి కి.మీ.కి ఒక పైసా చొప్పున పెరిగింది, ఏసీ క్లాస్‌లో ప్రతి కి.మీ.కి రెండు పైసల చొప్పున పెరిగింది. ఈ పెంపు వల్ల సంవత్సరానికి రూ.600 కోట్ల ఆదాయం రైల్వేలకు సమకూరుతుంది. గడచిన దశాబ్దంలో నెట్‌వర్క్, కార్యకలాపాలను గణనీయంగా విస్తరించినట్లు రైల్వేలు ప్రకటించింది. ఉద్యోగుల సంఖ్యను కూడా పెంచినట్లు తెలిపింది. ఉద్యోగుల కోసం ఖర్చులు రూ.1,15,000 కోట్లకు పెరిగినట్లు, పింఛను వ్యయం రూ.60 వేల కోట్లకు పెరిగినట్లు వివరించింది. ఈ ఖర్చులను భరించడం కోసం కార్గో లోడింగ్, ప్రయాణికుల టిక్కెట్ చార్జీల పెంపుపై దృష్టి పెట్టినట్లు పేర్కొంది.



# లడ్డూ కావాలా



## జుట్టు పెరుగుదలకు లడ్డు

మీ జుట్టు పెరుగుదలను వేగంగా జరగాలంటే, ఈ లడ్డూ రెసిపీని ఫాలో అవ్వండి. మీ జుట్టును చాలా వేగంగా ఎదుగుతుంది. వెంట్రుకలు మోకాలి వరకు చేరుకుంటాయి. జుట్టు రాలడం, పెరుగుదల మందగించడంతో ప్రతి ఒక్కరూ ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య నుండి బయటపడటానికి వివిధ రకాల రసాయన జుట్టు ఉత్పత్తులను ఉపయోగిస్తున్నారు. అయితే, ఇప్పుడు మీరు మీ జుట్టుకు ఏమీ వేయనవసరం లేదు. కానీ, మీరు లడ్డూ తినాలి, వినడానికి మీకు వింతగా అనిపించవచ్చు కానీ, ఇది నిజం. పొడవాటి, మందపాటి అందమైన జుట్టు రహస్యం ఇది. ఇంట్లోనే ఈ లడ్డూలను తయారు చేసుకోవచ్చు. ఇది జుట్టుకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. మీ జుట్టును సిల్కీగా, మెరిసేలా చేయడంలో కూడా సహాయపడుతుంది. అప్పుడు ఈ పోషకాలు అధికంగా ఉండే లడ్డూలను తయారు చేసే రెసిపీని తెలుసుకుందాం. వీటిని తయారుచేయడానికి మీకు ఇవి అవసరం

గుమ్మడికాయ గింజలు 1/3 కప్పు
పిస్తా 1/3 కప్పు, కొబ్బరి పొడి 2/3 కప్పు
మోరింగ పొడి 2 టీస్పూన్లు
యాలకుల పొడి 3 చిటికెలు
ఎండుద్రాక్ష 3/4 కప్పు

ముందుగా పాన్ తీసుకుని సొరకాయ గింజలు, పిస్తా, కొబ్బరి పొడి వేసి బాగా వేయించాలి. వేగిన తర్వాత ఈ మూడింటిని మిక్సీలో వేసుకోవాలి. ఇప్పుడు అదే బాణలిలో ఎండుద్రాక్ష వేసి కొద్దిగా వేయించాలి. ఇప్పుడు ఎండు ద్రాక్షను మిక్సీలో ఉసిరికాయ పొడి, యాలకులు వేసి అన్ని పదార్థాలను బాగా కలపాలి. మెత్తటి పొడి సిద్ధంగా ఉన్నప్పుడు, దానిని ఒక ప్లేట్‌లో తీసి, మీ చేతులతో లడ్డూలను తయారు చేయడం ప్రారంభించండి. జుట్టు పెరుగుదలను వేగవంతం చేసే లడ్డూలు రెడీ. వాటిని గాలి చొరబడని కంటైనర్‌లో నిల్వ చేయాలి. రోజూ ఒక లడ్డు తినాలి.



# తల్లి కావాలని అనుకుంటున్నారా!

## ఈ విషయాలకు దూరంగా ఉండండి

గర్భం దాల్చిన సమయంలో అక్కడక్కడ ఏదైనా తింటే అది నేరుగా బిడ్డపై ప్రభావం చూపుతుంది. కాబట్టి ఈ కాలంలో ఆహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. గర్భం దాల్చిన మొదటి రోజులు కష్టాలతో నిండి ఉంటాయి. ఈ కాలంలో ఆహారం, జీవనశైలిపై జాగ్రత్తగా ఉండాలి. ఏం తినాలనుకున్నా డాక్టర్‌ని అడిగిన తర్వాతే తినండి. గర్భధారణ సమయంలో కోరికలను నియంత్రించుకోవాలి. పచ్చి గుడ్డు అతిసారం, కడుపు నొప్పి, జ్వరం, వాంతులు, డీహైడ్రేషన్ కు కారణమవుతుంది. కాబట్టి గర్భధారణ సమయంలో అస్సలు తినకూడదు. పచ్చి చేపలకు దూరంగా ఉండాలి. ఆల్కహాల్ పిల్లల అభివృద్ధికి హాని కలిగిస్తుంది. అధిక కెఫీన్ గర్భస్రావం ప్రమాదాన్ని పెంచుతుంది. పాలిత కుక్కలు, పిల్లుల నుండి కొంత దూరం పాటిచాలి. గర్భం దాల్చిన మొదటి మూడు నెలలలో ఉప్పు ఎక్కువగా తినకూడదు. పచ్చి మొలకలు తినకూడదు. మొదటి మూడు నెలలు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. పైనాపిల్, పచ్చి బొప్పాయిలో రబ్బరు పాలు ఉంటాయి కాబట్టి వాటిని నివారించాలి. పచ్చి లేదా తక్కువగా వండిన మాంసం, పౌల్ట్రీ, గుడ్లు, చేపలు లేదా షెల్ఫిష్‌లను నివారించండి. పాశ్చరైజ్ చేయని పాలు, మెత్తని చీజ్ ఐస్‌క్రీమ్‌లను నివారించండి. రిఫ్రిజిరేటెడ్ మాంసం, రిఫ్రిజిరేటెడ్ పేట్స్, మాంసం స్ప్రెడ్‌లు, పొగబెట్టిన సీఫుడ్ నివారించండి. పుట్టబోయే బిడ్డకు హాని కలిగించే విటమిన్ 'ఎ' అధికంగా ఉండే కాలేయం, కాలేయ ఉత్పత్తులను నివారించండి. గేమ్ మాంసాన్ని నివారించండి, ఇందులో సీసం ఉండవచ్చు. కెఫిన్ రోజుకు 200 మిల్లీగ్రాముల కంటే తక్కువగా ఉంచాలి. అధిక ఉప్పు శరీరంలో నీరు నిలుపుదలని కలిగిస్తుంది అధిక రక్తపోటుకు దారితీస్తుంది.

**గమనిక: ఇవి సమాచారం కొరకు మాత్రమే, నిర్ధారణ కొరకు వైద్యులను సంప్రదించండి**

# 'వీబీ జీ రామ్ జీ' బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

**ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 21:** మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ చట్టం స్థానంలో కేంద్రం తీసుకు వచ్చిన 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్' వీబీ జీ రామ్ జీ బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఆదివారంనాడు ఆమోదం తెలిపారు. దీంతో ఈ బిల్లు చట్టంగా మారింది. గతంలో 100 రోజులు పని దినాలు కల్పించిన ఎంజీఎన్ఆర్ఈజీఏ స్థానంలో 125 రోజుల పాటు గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన వారికి పనిదినాలు కల్పించే లక్ష్యంతో కేంద్రం 'వీబీజీ రామ్ జీ' బిల్లును తెచ్చింది. ఇటీవల ముగిసిన పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో 'వీబీజీ రామ్ జీ' బిల్లును పార్లమెంటు ముందుకు కేంద్రం తీసుకువచ్చింది. సమవేశాల చివరిరోజు లోక్‌సభలో 8 గంటల చర్చ అనంతరం బిల్లుకు ఆమోదం లభించింది. వెంటనే రాజ్యసభకు పంపి 4 గంటల చర్చ అనంతరం మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపారు. చర్చకు తగిన సమయం ఇవ్వలేదంటూ విపక్షాలు రాజ్యసభలో వాకౌట్ చేశాయి. ఉభయసభలు ఆమోదించిన ఈ బిల్లును రాష్ట్రపతి ఆదివారంనాడు ఆమోదించడంతో బిల్లు చట్టంగా మారింది.

# ఆరావళి పర్వతాలపై అసత్య ప్రచారం ఆపండి

- కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్

**ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 21:** ఆరావళి పర్వతాల మైనింగ్‌పై కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని కేంద్ర పర్యావరణశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ అన్నారు. అక్కడ కేవలం 0.19% శాతం పరిధిలోనే తవ్వకాలకు అనుమతి ఇచ్చినట్టు చెప్పారు. ఆరావళి పర్వతాలు ఢిల్లీ, హరియాణా, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల పరిధిలో 1,47,000 చదరవు కిలోమీటర్లమేర విస్తరించి ఉన్నాయి. ఆరావళి పర్వతాల పరిధిని నిర్దేశించాలంటూ సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో మంత్రి భూపేంద్ర యాదవ్ ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ వ్యవహారం 1985 నుంచి సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు. ఆరావళి పరిధి నాలుగు రాష్ట్రాల్లో ఒకే నిర్వచనం కలిగి ఉండాలని సుప్రీంకోర్టు ఆదేశించిందని గుర్తు చేశారు. కానీ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. పర్వతాల కింది నుంచి పైభాగం వరకు 100 మీటర్ల వరకు విస్తరించి ఉంటాయని, రెండు పర్వతాల మధ్య ప్రదేశాన్ని కూడా ఆరావళిగానే పరిగణించాల్సి ఉంటుందని వివరించారు.




# ఏఐ, చాట్ జీపీటీ వాడొద్దు

- ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం ఆదేశం

**ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 21:** మనదేశంలో ఏఐ, చాట్ జీపీటీ టెక్నాలజీ వాడకం అనూహ్యంగా పెరిగిపోయింది. అయితే ఈ రెండింటినీ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు వాడటం అత్యంత ప్రమాదకరమని కేంద్రం తాజాగా పేర్కొన్నది. దేశానికి సంబంధించిన రహస్య సమాచారమంతా బయటకు వెళ్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వానికి చెందిన సమాచారాన్ని మరింత ఎక్కువగా, చక్కగా తీర్చిదిద్దేందుకు కొందరు అధికారులు ఏఐ, చాట్ జీపీటీల ద్వారా షేర్ చేస్తున్నట్టు కేంద్రం తెలిపింది. దీనివల్ల మనదేశంలో ఏం జరుగుతున్నది? ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, చేస్తున్న పనులు, ఇతర కీలక సమాచారం అంతా ఏఐ, చాట్ జీపీటీ ద్వారా పక్క దేశాలకు చేరుతున్నట్టు కేంద్రం రాజ్యసభలో వెల్లడించింది. వీటిని అరికట్టేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నట్టు కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద సభకు తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులెవరూ ఈ రెండు వేదికల్లో (ఏఐ, చాట్ జీపీటీ) ప్రభుత్వ సమాచారాన్ని షేర్ చేయరాదంటూ ఆదేశాలు జారీ చేసినట్టు మంత్రి తెలిపారు.

# ఆటలు

@prathipaksham
prathipaksham tv telugu

## ఫైనల్లో తడబడ్డారు.. కప్ గెలిచిన పాకిస్తాన్

పురుషుల అండర్ 19 ఆసియకప్ ఫైనల్లో భారత జట్టుకు పాకిస్థాన్ బిగ్ షాకిచ్చింది. భారీ స్కోర్ చేసిన పాక్ అనంతరం పవర్ ప్లేలోనే కీలక వికెట్లు తీసి టీమిండియాను దెబ్బకొట్టింది. ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ(26), ఆయుష్ మాత్రే(2)ను ఔట్ చేసి భారత్‌ను అలీ రజా(442) ఒత్తిడిలో ఒత్తిడిలో పడేశాడు. పాక్ బౌలర్లు షార్ట్ పిచ్ బంతులకు మిడిలార్డర్ బ్యాటర్లు వికెట్ ఇచ్చేశారు. టాప్ స్కోరరైన దీపేశ్ దేవేంద్ర(36)ను చివరి వికెట్ గా వెనుదిరగడంతో 26.2 ఓవర్లలో 156కు భారత్ ఆలౌటయ్యింది. దాంతో.. 191 పరుగుల తేడాతో గెలుపొందిన పాకిస్థాన్ 12వ సారి విజేతగా రికార్డు నెలకొల్పింది. అజేయంగా అండర్ 19 ఆసియాకప్ ఫైనల్ చేరిన భారత్ అనూహ్యంగా బోల్తా పడింది. లీగ్ దశలో పాకిస్థాన్‌ను చిత్తు చేసిన టీమిండియా.. టైటిల్ పోరులో మాత్రం తలొగ్గింది. మొదట ప్రత్యర్థిని భారీ స్కోర్ చేయనిచ్చిన ఆయుష్ మాత్రే బృందం.. ఆ తర్వాత బ్యాట్లెత్తేసింది. ఫైనల్లో భారత బౌలర్లను ఉతికేసిన పాక్ ఓపెనర్ సమీర్ మిన్హాస్(172) విధ్వంసక సెంచరీతో చెలరేగాడు. అహ్మద్ హుసేన్(56) అర్ధ శతకంతో మెరవగా దాయాది జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 347 పరుగులు చేసింది. భారీ ఛేదనలో టీమిండియాకు ఆరంభంలోనే షాకిచ్చాడు అలీ రెజా(442). ఓపెనర్ ఆయుష్ మాత్రే(2)ను పెవిలియన్ పంపిన అతడు కాసేపటికే డేంజరస్ వైభవ్ సూర్యవంశీ(26)ని సైతం వెనక్కి పంపాడు. ఆదిలోనే కష్టాల్లో పడిన టీమిండియాను గట్టెక్కిస్తారనుకున్న అరోన్ జార్జ్(16), విహాన్ మల్హోత్రా(7), అభిగ్యాన్ కుందు(13)లు పాక్ బౌలర్ల షార్ట్ పిచ్ బంతులకు వికెట్ పారేసుకున్నారు. 59కే నాలుగు, 94కే ఏడు వికెట్లు పడడంతో టీమిండియా కోలుకోలేకపోయింది. పవర్ ప్లేలోనే కీలక వికెట్లు పడడంతో మ్యాచ్ పాక్ చేతుల్లోకి వెళ్లింది. ప్రధాన బ్యాటర్లు డగౌట్ చేరినా దీపేశ్ దేవేంద్రన్(36) ఉన్నంతసేపు ధనాధన్ ఆడాడు. పాక్ బౌలర్లను దంచేస్తూ ఆరు ఫోర్లు, 2 సిక్సర్లు బాదిన దీపేశ్ చివరకు రజా ఓవర్లో క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అంతే.. 26.2 ఓవర్లలోనే మ్యాచ్ ముగియగా.. 191 పరుగులతో గెలుపొందిన పాక్ 12వ సారి ఆసియా విజేతగా నిలిచింది.

## జెమీమా విధ్వంసం... ఇండియా విజయం

వన్డే ఛాంపియన్ భారత జట్టు తొలి సిరీస్‌ను విజయంతో ఆరంభించింది. విశాఖపట్టణంలో జెమీమా రోడ్రిగ్స్ (69 నాటౌట్) క్లాస్ ఇన్నింగ్స్‌తో చెలరేగగా శ్రీలంకను చిత్తుగా ఓడించింది. ప్రపంచకప్ ఫామ్‌ను కొనసాగించిన జెమ్మీ.. స్మృతి మంధాన(25)తో హాఫ్ సెంచరీ భాగస్వామ్యంతో విజయానికి బాటలు వేసింది. మంధాన ఔటైనా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(15 నాటౌట్)తో కలిసి కూల్‌గా ఆడిన జెమ్మీ.. టీమిండియాను 8 వికెట్లతో గెలిపించింది. మరో 5 ఓవర్లు మిగిలి ఉండగానే ప్రత్యర్థిని మట్టికరిపించిన భారత్ ఐదు టీ20ల సిరీస్‌లో 10తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. స్వదేశంలో ఇటీవలే వన్డే ప్రపంచకప్ పట్టేసిన టీమిండియా.. టీ20 వరల్డ్‌కప్ సన్నద్ధతను ఘనంగా ఆరంభించింది. శ్రీలంకతో విశాఖలో జరిగిన తొలి టీ20లో భారత్ భారీ విజయం సాధించింది. మొదట శ్రీ చరణి(130), క్రాంతి గౌడ్(123)లు లంకను 121కే కట్టడి చేశారు. అనంతరం స్వల్ప ఛేదనలో షఫాలీ వర్మ(9) విఫలమైనా స్మృతి మంధాన (25) తన స్టయిల్లో రెచ్చిపోయింది. ఈ ఫార్మాట్లో 4 వేల క్లబ్‌లో చేరిన మంధాన.. కాసేపటికే రణవీర ఓవర్లో సిక్సర్‌కు యత్నించి వెనుదిరిగింది. దాంతో రెండో వికెట్‌కు జెమా రోడ్రిగ్స్(69 నాటౌట్)తో నెలకొల్పిన 54 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(15 నాటౌట్)తో కలిసి జట్టును గెలుపు దిశగా నడిపించింది జెమీమా. గిహ్మాని వేసిన 12వ ఓవర్లో రెండు ఫోర్లతో అర్ధ శతకం పూర్తి చేసుకున్న జెమీమా.. చివరి రెండు బంతుల్ని బౌండరీకి తరలించింది. దాంతో.. లక్ష్యం ఐస్ ముక్కలా కరిగిపోగా.. హర్మన్‌ప్రీత్ కూల్‌గా ఆడింది. రణవీర వేసిన 15వ ఓవర్లో జెమీమా సింగిల్ తీయగా 8 వికెట్ల తేడాతో గెలుపొందిన టీమిండియా సిరీస్‌లో ముందంజ వేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక ఇన్నింగ్స్ నత్తనడకన సాగింది. ఓపెనర్లు విష్మీ గుణరత్నే(39), చమరి ఆటపట్టు(15) శుభారంభమిచ్చిన ఆ తర్వాతి బ్యాటర్లు సద్వినియోగం చేసుకోలేకపోయారు. శ్రీ చరణి(130), క్రాంతి గౌడ్(123)లు పొదుపుగా బౌలింగ్ చేయడంతో బౌండరీలు రాబట్టేందుకు లంక బ్యాటర్లు తిప్పలు పడ్డారు. హాసిని పెరీరా(20), హర్షిత మాధవి(21)లు కీలక భాగస్వామ్యంతో లంక స్కోర్ వంద దాటింది. ఆఖర్లో.. కవిష దిల్హరి(8) మాత్రమే రాణించారు. దాంతో.. నిర్ణీత ఓవర్లలో లంక 6 వికెట్ల నష్టానికి 121కే పరిమితమైంది.

## యాషెస్.. ఆస్ట్రేలియాదే

స్వదేశంలో జరుగుతున్న యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా హ్యాట్రిక్ కొట్టింది. పెర్త్, బ్రిస్బేన్‌లో ఇంగ్లండ్‌కు షాకిచ్చిన ఆసీస్ అడిలైడ్‌లోనూ పంజా విసిరింది. మిచెల్ స్టార్క్(362), నాథన్ లియాన్(377) విజృంభించడంతో చావోరేవో మ్యాచ్‌లో పర్యాటక జట్టు బ్యాటర్లు చేతులెత్తేశారు. ఐదోరోజు జేమీ స్మిత్(60), విల్ జాక్స్ (47)లు పోరాడినా స్టార్క్ వీరిద్దరిన ఔట్ చేసి ఇంగ్లండ్ ఆశలపై నీళ్లు చల్లాడు. అడిలైడ్‌లో 82 పరుగుల తేడాతో గెలుపొందిన కంగారూ టీమ్ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 30తో పట్టేసింది. యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్ పోరాడలేక ట్రోఫీ సమర్పించుకుంది. ఆస్ట్రేలియా బౌలర్ల జోరుకు ప్రధాన బ్యాటర్లు క్రీజులో నిలవలేకపోవడంతో 82 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఓవర్‌నైట్ స్కోర్ 2076 తో ఐదో రోజు ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్‌ను మిచెల్ స్టార్క్(362) దెబ్బకొట్టాడు. అర్ధ శతకంతో రాణించిన జేమీ స్మిత్(60)ను, విల్ జాక్స్(47)ను ఔట్ చేసి పర్యాటక జట్టును ఓటమి ఖాయం చేశాడు. దాంతో, తొలి రెండు టెస్టుల్లో ఆస్ట్రేలియాకు కనీసం పోటీ ఇవ్వలేకపోయిన ఇంగ్లిష్ టీమ్.. అడిలైడ్‌లోనూ అదే తడబాటుతో సిరీస్ సమర్పించుకుంది. ఆసీస్ నిర్దేశించిన భారీ ఛేదనలో ఓపెనర్ జాక్ క్రాలే(85) అర్ధ శతకంతో ఆశలు రేపినా.. కమిన్స్ (324), నాథన్ లియాన్(364) వికెట్ల వేటకు టాపార్డర్ కుప్పకూలింది. కమిన్స్ ఓవర్లో జో రూట్ (39), లియన్ దెబ్బకు హ్యారీ బ్రూక్(30)లు తేలిపోయారు. స్వల్ప తేడాతో బ్రూక్‌ను, బెన్‌స్టోక్స్(5)ను బౌల్డ్ చేసిన లియాన్ ఇంగ్లండ్‌ను విజయావకాశాల్ని దెబ్బతీశాడు. అర్ధ శతకంతో పోరాడిన క్రాలేను ఔట్ చేసి ఇంగ్లండ్‌ను ఓటమి అంచున నిలిపాడు లియాన్. ఆఖరి సెషన్‌లో వికెట్ కాపాడుకున్న జేమీ స్మిత్, విల్ జాక్స్ ఐదోరోజు పోరాడినా స్టార్క్ వీరిద్దరిని పెవిలియన్ పంపి ఇంగ్లండ్ యాషెస్ కలను భగ్నం చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో మెరిసిన అలెక్స్ క్యారీ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు.

## 100 మిలియన్లకు చేరువలో..

రంజీవి టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం మన శంకర వర ప్రసాద్ గారు. అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ 'పండగకు వస్తున్నారు' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తోంది. లేడీ సూపర్ స్టార్ నయనతార ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఇప్పటికే రిలీజ్ చేసిన గ్లింప్స్ ఇప్పటికే నెట్టింట రౌండప్ చేస్తోంది. మరోవైపు మీసాల పిల్ల సాంగ్ నెట్టింట ట్రెండింగ్‌లో నిలుస్తోంది. ఇప్పటికే ఈ సాంగ్ ఇండియావైడ్‌గా యుట్యూబ్‌లో నంబర్ 1 స్థానంలో ట్రెండింగ్‌లో నిలిచిన విషయం తెలిసిందే. తాజాగా మరో అరుదైన మార్క్ దిశగా వెళ్తుంది మీసాల పిల్ల సాంగ్. యూట్యూబ్‌లో ఇప్పటివరకు ఈ పాట 90 మిలియన్ల మార్క్ దాటి.. 100 మిలియన్ల మార్క్ దిశగా దూసుకెళ్తోంది. 2025 చివరి నాటికి ఈ మార్క్ చేరుకోవడం ఖాయమని అంచనాల వేస్తున్నాడు ట్రేడ్ పండితులు. మొత్తానికి ఈ ఏడాది విడుదలైన టాలీవుడ్ సాంగ్స్‌లో టాప్‌లో 10లో ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు.ఈ చిత్రంలో వీటీవీ గణేశ్, కేథరిన్ థ్రెసా, హర్షవర్దన్, రేవంత్ భీమల (సంక్రాంతికి వస్తున్నాం) ఫేం బుల్లిరాజు) కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెలవిష్ణు ప్రసాద్ హోం బ్యానర్ గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ మూవీని 2026 సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల చేయనుండగా.. విడుదల తేదీపై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

## అనుకున్నదానికన్నా ఎక్కువే

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, దర్శకుడు మారుతి కాంబోలో రూపొందుతున్న మోస్ట్ అవెయిటెడ్ హారర్ కామెడీ థ్రిల్లర్ 'ది రాజా సాబ్' పై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. సంక్రాంతి కానుకగా జనవరి 9న వరల్డ్ వైడ్‌గా విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమాపై ఇప్పటికే రిలీజ్ అయిన టీజర్, ట్రైలర్, పాటలు భారీ హైప్ క్రియేట్ చేశాయి. వింటేజ్ ప్రభాస్‌ను మళ్లీ వెండితెరపై చూడబోతున్నామనే ఉత్సాహంతో ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉండగా, ఈ సినిమాకు సంబంధించిన ఓటీటీ డీల్‌పై తాజాగా ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ 'ది రాజా సాబ్' నాన్-థియేట్రికల్ బిజినెస్ గురించి స్పందించారు. నెల రోజుల క్రితమే ఓటీటీ డీల్ ఫైనల్ అయిందని, అయితే తాము ఊహించిన స్థాయిలో డీల్ జరగలేదని తెలిపారు. "ది రాజా సాబ్ ఓటీటీ డీల్ ముగిసింది. కానీ మేము అనుకున్నంత వసూళ్లు రాలేదు. ప్రస్తుతం ఓటీటీ మార్కెట్ ఇలానే ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇక డిజిటల్ రైట్స్ విషయానికొస్తే, మొదట ఈ సినిమా హక్కులను నెట్‌ఫ్లిక్స్ దక్కించుకుంటుందనే ప్రచారం సాగింది. కానీ అనూహ్యంగా ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ జియో హాట్‌స్టార్ ఈ మూవీ డిజిటల్ హక్కులను సొంతం చేసుకున్నట్లు సమాచారం. అప్పట్లో పాన్ ఇండియా భాషలు కలిపి దాదాపు రూ.170 కోట్ల డీల్ జరిగిందని టాక్ నడిచింది. అయితే నిర్మాత వ్యాఖ్యలతో అసలు డీల్ ఎంతకు పూర్తయిందనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

## సక్సెస్ దక్కింది

యాంకర్ సుమ తనయుడు రోషన్ కనకాల హీరోగా నటించిన లవ్ అండ్ యాక్షన్ ఎంటర్టైనర్ 'మోగ్లీ' బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని నమోదు చేసింది. సందీప్ రాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో సాక్షి సాగర్ మడోల్కర్ కథానాయికగా నటించగా, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మించారు. డిసెంబర్ 12, 2025న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం, విడుదలైన తొలి ఆట నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. సినిమా విడుదలైన తొలి వారంలోనే బ్రేక్ ఈవెన్‌ను దాటడం విశేషం. సుమారు రూ.8 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన 'మోగ్లీ', థియేట్రికల్‌తో పాటు నాన్‌థియేట్రికల్ రైట్స్ ద్వారా మొత్తం దాదాపు రూ.10 కోట్ల వసూళ్లు సాధించినట్లు సమాచారం. దీంతో నిర్మాతలకు లాభాలు అందించిన సినిమాగా 'మోగ్లీ' నిలిచింది. ప్రస్తుతం ఈ చిత్రం విజయవంతంగా రెండో వారంలోకి అడుగుపెట్టింది. రోషన్ కనకాల నటనకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. యంగ్ హీరోగా ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, యాక్షన్ సన్నివేశాల్లో చూపిన ఎనర్జీ ఆకట్టుకుంటున్నాయని విమర్శకులు ప్రశంసిస్తున్నారు. ముఖ్యంగా విలన్ పాత్రలో బండి సరోజ్ కుమార్ చేసిన నటన సినిమాకు పెద్ద ప్లస్‌గా మారింది. ఆయన ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్‌కు ప్రత్యేకంగా ప్రశంసలు దక్కుతున్నాయి.


Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200